RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:40 29-7-2025 మంగళవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

# మహిళల చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్.. కోనేరు హంపి ఓటమి..




టుడే విదుర,జులై 28: ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్ నిలిచింది. ఈ రోజు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కోనేరు హంపిపై దివ్య దేశ్‌ముఖ్ విజయం సాధించింది. ఈ విజయంతో 19 ఏళ్ల దివ్య భారతదేశానికి చెందిన ఎనభై ఎనిమిదో గ్రాండ్ మాస్టర్‌గా అవతరించింది. దివ్య దేశ్‌ముఖ్, కోనేరు హంపి మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జరిగిన తొలి ర్యాపిడ్ ట్రై బ్రేకర్ డ్రాగా ముగిసింది. అయితే ఆ తర్వాత రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో కోనేరు హంపిపై దివ్య గెలుపొందింది.

2025 ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్స్‌కు చేరిన తొలి క్రీడాకారిణిగా దివ్య నిలిచింది. చివరకు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో దివ్యకు 1.5 పాయింట్లు లభించగా, కోనేరు హంపికి 0.5 పాయింట్లు వచ్చాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దివ్యకు హంపీ గట్టి పోటీనిచ్చింది. దీంతో ఫలితం ట్రైబ్రేకర్‌కు చేరింది. సోమవారం దూకుడుగా ఆడిన దివ్య టోర్నీ విజేతగా నిలిచి గ్రాండ్ మాస్టర్ హోదాను దక్కించుకుంది.

## విజయవాడలో నీటి సరఫరాని ప్రధాని మోదీ అభినందించారు: మంత్రి నారాయణ



అమరావతి,టుడే విదుర,జులై 28: విజయవాడలో నీటి సరఫరాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించడం గర్వకారణమని మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. మన్ కీ బాత్‌లో విజయవాడలో నీటి సరఫరాపై ప్రధాని ప్రశంసలు కురిపించారని చెప్పుకొచ్చారు. విజయవాడలో నీటి నిర్వహణ చాలా బాగుందని ప్రధాని వెూదీ వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర, ఇతర అధికారులు, సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. ఈ మేరకు (సోమవారం) మంత్రి నారాయణ ఓ ప్రకటన విడుదల చేశారు.పధాని మోదీ వ్యాఖ్యలు కూటమి ప్రభుత్వ అభివృద్ధికి నిదర్శనమని మంత్రి నారాయణ ఉద్ఘాటించారు. సీఎం చంద్రబాబు పర్యవేక్షణతో విజయవాడలో ఇటీవలే స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు దక్కించుకుందని తెలిపారు. విజయవాడ కార్పొరేషన్‌లో ప్రతి రోజూ 16 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండప్రాంతాల్లో సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తున్నామని వివరించారు. సీఎం చంద్రబాబు కృషితో రాష్ట్రానికి అమృత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. అమృత్ పథకం ద్వారా ఏపీవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో వచ్చే మూడేళ్లలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ‘కాలేజీలు ఖాళీ’ అంటూ ప్రచారం.. మంత్రి లోకేష్ మాస్ వార్నింగ్



అమరావతి, టుడే విదుర,జులై 28: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పని తీరునే లక్ష్యంగా చేసుకొని వైసీపీ ఆరోపణలు, విమర్శలు గుప్పిస్తోంది. ఆ క్రమంలో వివిధ అంశాలపై అవాస్తవాలను కథనాల రూపంలో వైసీపీకి చెందిన మీడియా ప్రచురిస్తోంది. తాజాగా అటువంటి చర్యలే ఆ పార్టీ మీడియా పాల్పడింది. దీనిపై సింగపూర్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు.జగన్మోహన్ రెడ్డి అవినీతి విష పుత్రిక, రోత పత్రిక సాక్షిలో ఈ రోజు కాలేజీలు ఖాళీ అంటూ అబద్ధాలను వండి ఓ తప్పుడు కథనాన్ని ప్రచురించారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యలో గత ఏడాది కాలంగా మేము తెచ్చిన సంస్కరణల కారణంగా 2025-26 విద్య సంవత్సరంలో దాదాపు 18 శాతం మేర అడ్మిషన్లు పెరిగాయి. డేటా ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఈ నెల 31వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయి.ప్రకాశం జిల్లా కనిగిరి వంటి మారుమూల ప్రాంతాల్లోని కళాశాలల్లో సైతం అడ్మిషన్లు రెట్టింపు కావడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనం. విద్యార్థులు, అధ్యాపకుల్లో మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే తప్పుడు రాతలపై ప్రభుత్వం చట్ట పరంగా చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు వైసీపీ మీడియా, నేతలపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు.ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను లక్ష్యంగా చేసుకుని పెట్టుబడులు ఆకర్షించేందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు పి. నారాయణ, నారా లోకేష్, టీజీ భరత్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఆ క్రమంలో ఈ ప్రతినిధి బృందం పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. జులై 31వ తేదీన ఈ పర్యటన ముగించుకుని సీఎం చంద్రబాబు బృందం స్వదేశానికి తిరిగి రానుంది.మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి పట్టం కడుతూ ఆంధ్రప్రదేశ్ ఓటరు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. దీంతో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న పలు కుంభకోణాలను వెలికి తీసే ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం చేపట్టింది. అలాంటి వేళ.. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని వైసీపీకి చెందిన మీడియా అసృత కథనాలకు తెర తీసిందనే వాదన వినిపిస్తోంది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వెంకయ్య నాయుడు



తిరుమల:టుడే విదుర,జులై 28: తిరుమలలో వేంకటేశ్వర స్వామిని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కన్నడ హీరో శివరాజ్ కుమార్, దర్శకుడు గోపీచంద్, ఎవెమ్మెల్యేలు యశస్విని రెడ్డి, శ్రీధర్ దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మీడియాతో మాట్లాడారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించడం ఆనందదాయకంగా ఉందని వ్యాఖ్యానించారు. అన్నప్రసాదాన్ని చాలా చక్కని రుచితో పాటు శుచిగా చేస్తున్నారని ప్రశంసించారు. నిత్యం వేలాది మంది భక్తులకు స్వామివారి అన్నప్రసాదం అందజేస్తున్నఈ కేంద్రం నిర్వహణా బృందానికి అభినందనలు తెలిపారు. ఈ స్ఫూర్తిని అన్ని ఆలయాలు ఆదర్శంగా తీసుకోవాలని ఆకాంక్షించారు వెంకయ్య నాయుడు.



## ఇంద్రకీలాద్రిపై సెప్టెంబర్ 22 నుంచి దసరా మహోత్సవాలు : ఈవో వీకే శీనానాయక్

### అక్టోబర్ 2 వరకు 11రోజుల పాటు వైభవంగా ఉత్సవాల నిర్వహణ..

**11రోజులు.. 11 అలంకారాలు**

**10 సంవత్సరాల తర్వాత కాత్యాయని దేవి అవతారం**

**మూలా నక్షత్రం రోజున సీఎం పట్టు వస్త్రాలు సమర్పణ**

ఎన్టీఆర్ బ్యూరో,టుడే విదుర,జులై 28 : దేశ విదేశాలతో పాటు సుదూర ప్రాంతాల నుండి కనకదుర్గమ్మ వారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వీకే శినా నాయక్ ప్రకటించారు. ఇంద్రకీలాద్రి పై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కనకదుర్గమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచి ఇంద్రకీలాద్రిపై నిర్వహించనున్న దసరా మహోత్సవాల నిర్వహణపై సోమవారం కార్యనిర్వహణ అధికారి వీకే శీనానా యక్.. వైదిక కమిటీ సభ్యులు, వేదపండితులతో కలిసి మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలకు సంబంధించి శుభ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. అనంతరం ఈవో మాట్లాడుతూ శ్రీ విశ్వావసు నామ సంవత్సర దసరా మహోత్సవాలను సెప్టెంబర్ 22నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించాలని వైదిక కమిటీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

## ఏపీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు.. జగన్‌పై పల్లా ఫైర్



అమరావతి,టుడే విదుర,జులై 28 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పిల్ల వైసీపీ సైకోల విష ప్రచారం సృతి మించుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి వచ్చే పెట్టుబడులను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. (సోమవారం) అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. దెయ్యాల్లా మంచిని జీర్ణించుకోలేక గోల చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారడం లేదని దుయ్యబట్టారు. నీచ రాకీయాలు, అబద్ధాలతో వైషమ్యాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు పల్లా శ్రీనివాసరావు.

## ఏపీలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లలో బయటపడుతున్న అక్రమాలు




విశాఖపట్నం,టుడే విదుర,జులై 28: నగరంలోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో అక్రమాలు బయటపడుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ జంట ఫిర్యాదుతో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాల డొంక కదిలింది. విశాఖపట్నంలో గత రెండేళ్లుగా రహస్యంగా సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌ని ఓ డాక్టర్ నడుపుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన మహిళ విశాఖలోనే చికిత్స పొందినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విశాఖ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో మహిళలకు వైద్యం చేసినట్లు అనేక అనుమానాలు వస్తున్నాయి. జిల్లాలో 50 ఫెర్టిలిటీ సెంటర్‌లలో.. కేవలం 9 కేంద్రాలకు మాత్రమే సరోగసీకి ప్రభుత్వ అనుమతి ఉంది. గత రెండేళ్లుగా విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఫెర్టిలిటీ సెంటర్‌లని పట్టించుకోలేదు. పేద ప్రజలని టార్గెట్ చేసుకొని ఫెర్టిలిటీ సెంటర్లు అక్రమ దందాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సృష్టి వ్యవహారంతో మిగిలిన ఫెర్టిలిటీ సెంటర్‌లపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు చేస్తే మరిన్ని వాస్తవాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

# సంపాదకీయం

## తరిమెల నాగిరెడ్డిని గవర్నర్ ఆహ్వానించి ఉంటే

జననేత తరిమెల నాగిరెడ్డి చనిపోయి అర్ధ శతాబ్ది కావస్తున్నా ఇంకా ఆయన జీవితం నుండి పొందాల్సిన స్ఫూర్తి అనంతమే! 'తాకట్టులో భారతదేశం' అనే విశ్లేషణతో ఆయన కోర్టులో ఇచ్చిన స్టేట్‌మెంటు పుస్తక రూపంలో వచ్చి అనేక భారతీయ భాషల్లోకి అనువాదమైన ఇన్నేళ్ళ తర్వాత దాని ప్రాసంగికత ఇంకా పెరిగి ఇప్పుడు 'తాకట్టు కాదు, అమ్మకానికి భారతదేశం' అనే స్థాయికి చేరిందని చాలామంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాభై ఏళ్ల కాలంలో అనేకమంది మిత్రులు అనేక సందర్భాలలో ఆయన్ని గుర్తు చేశారు. నేనూ అనేకసార్లు వివిధ వేదికలపై ఆ పని చేయటంతో పాటు 'ప్రజాసేవలో తరిమెల నాగిరెడ్డి' పేరుతో 570 పేజీల పుస్తకాన్ని ఆయన శతజయంతి సందర్భంగా 2017లో ప్రచురించాను. యాభై రూపాయల రేటుతో ఇప్పటికి పది వేల కాపీలు జనంలోకి వెళ్లాయి. ఇప్పుడు ఎక్కువమందికి తెలియని కొత్త విషయాలు చెప్పటానికి ప్రయత్నిస్తాను. %ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్న ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచాలన్న ఆందోళన జరుగుతున్న రోజులవి. మద్రాసులో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో నాగిరెడ్డి (మద్రాసు రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు) కమ్యూనిస్టు పార్టీ పక్షాన పాల్గొని 3 గంటల సేపు ప్రసంగించారు. ఆ సభలో ప్రేక్షకునిగా ఉన్న సుప్రసిద్ధ చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖరశర్మ ఆయన ప్రసంగానికి ముగ్ధుడై సభానంతరం ఆయన నివాసానికి వెళ్లి "నాగిరెడ్డి గారూ నాకు కమ్యూనిస్టులంటే చాలా చులకన భావం ఉండేది. కాని మీలాంటి గొప్ప వక్త, విశ్లేషకుడూ ఆ పార్టీలో ఉన్నారని తెల్సుకుని నా అభిప్రాయం మార్చుకున్నాను" అని అభినందించారు. తర్వాత కొద్దికాలానికే పొట్టి శ్రీరాములు బలిదానంతో ఉద్యమం ఉధృతం కావటంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా, కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర శాసనసభలో కూడా నాగిరెడ్డి ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నారు. 1953 నవంబర్‌లో ఏర్పడిన ప్రకాశం మంత్రివర్గం సంవత్సర కాలంలోనే పడిపోయింది. మెజారిటీపక్ష (41 సీట్లు) నాయకుడుగా ఉన్న నాగిరెడ్డిని మంత్రివర్గం ఏర్పాటు చేయాలని ఆహ్వానించటం రాజ్యాంగ సంప్రదాయం. కమ్యూనిస్టు పార్టీ అదే కోరింది. చందూలాల్ మాధవలాల్ త్రివేది అప్పటి గవర్నర్. "%× ఘఖఅ ఱఅజఓవ ఎశీబ టశీతీ ఎఱఅఅవతీ చీుస్త్రఱ =వ౹౹ఎ, ఎబ్ అశీ శీ టశీతీఎ స్త్రశీజవతీఅఎవత్%" (నిన్ను భోజనానికి పిలవగలను నాగిరెడ్డీ, కాని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేను) అనే పరిస్థితి, ఆ ఒత్తిడి ఆయనపై లేకపోయి ఉంటే దేశ రాజకీయాలు, కమ్యూనిస్టుల పరిస్థితి మరోరకంగా ఉండేవి. మెజారిటీ పక్షానికి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వకుండా నెహ్రూ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలి అప్రజాస్వామిక చర్యకి పూనుకుంది. గవర్నర్‌ని కల్సిన సందర్భంలో, అనే పుస్తకం చదివారా? అని త్రివేది అడిగితే దానిపై సమాధానంగా వచ్చిన పుస్తకం కూడా చదివానని నాగిరెడ్డి చెప్పారు. 1975 జూలై 6న ఎడ్లపాడులో జరిగిన నా పెళ్లికి నాగిరెడ్డి అధ్యక్షత వహించాలి. వస్తున్నట్లు నాకు టెలిగ్రాం ఇచ్చి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. టెలిగ్రాం సెన్సార్ అయి నా పెళ్లి వేదికను సుమారు పాతికమంది పోలీసులు చుట్టుముట్టారు. మీసాలు వచ్చినప్పటి నుండి ఎప్పుడూ మీసాలు పెంచని ఆయన బుర్ర మీసాలు పెంచారు. సుప్రసిద్ధ నవలా రచయిత్రి మాదిరెడ్డి సులోచన ఇంట్లో పార్టీ అద్దెకు తీసుకున్న పోర్షన్‌ని పార్టీ డెన్‌గా ఉపయోగిస్తూ ఆ ఇంట్లో నుండే వస్తూపోతూ కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ ఉండగానే నాగిరెడ్డిలో అనారోగ్య లక్షణాలు కన్పడటంతో పార్టీ కార్యకర్తలుగా ఉన్న డా. బిక్కసాని పూర్ణ, ఆయన భార్య డా. మేదరమెట్ల అరుణ (తెలంగాణ పోరాట యోధుడు మేదరమెట్ల సీతారామయ్య కూతురు. ప్రస్తుతం ఇద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు) దగ్గరకు తీసుకెళ్లారు. వారి ట్రీట్‌మెంట్‌కి లొంగకపోవటంతో మాదిరెడ్డి వెంకట్రామయ్య అనే పేరుతో ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు. అదే వార్డులో చికిత్స పొందుతున్న ప్రముఖ సాహితీవేత్త శ్రీనివాస చక్రవర్తి, జయంతి పబ్లికేషన్స్ పెరుమాళ్లు ఆయన్ని గుర్తించలేదు. 1976 నాటికి ఉస్మానియాలో వెంటిలేటర్ సదుపాయం కూడా లేదు. తుదకి జూలై 28 ఉదయాన నాగిరెడ్డి చనిపోయారు. అప్పుడు అందుబాటులో పార్టీ నాయకులు ఎవరూ లేరు. సాయినాథ్, లాయర్ వెంకటరెడ్డి ఇద్దరూ ఏం చేయాలో తోచక ప్రముఖ లాయర్ సి. పద్మనాభరెడ్డి దగ్గరకు వెళ్ళి, పక్క ఇంటిలో ఉన్న మరో ప్రముఖ న్యాయవాది బాల్‌రెడ్డిని తీసుకొని యస్.ఆర్. నగర్‌లో ఉన్న నాగిరెడ్డి చెల్లెలు రమాదేవికి నాగిరెడ్డి పార్థివదేహాన్ని అప్పగించారు. ఈలోగా ప్రతిపక్ష నాయకులు వేములపల్లి శ్రీకృష్ణ ద్వారా ఈ విషయం ముఖ్యమంత్రి వెంగళరావుకి తెలియటంతో పోలీసులు అనంతపురం జిల్లా కల్లూరు గ్రామం వద్ద నాగిరెడ్డి పార్థివదేహం ఉన్న కారును అటకాయించి శవాన్ని స్వాధీనం చేసుకొని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తీసుకెళ్లారు. విషయం తెల్సుకున్న వేలాది ప్రజలు అక్కడకు చేరారు. నాగిరెడ్డిని చూడటానికి పోలీసులు ఎవరినీ అనుమతించలేదు. దానితో అక్కడేవున్న నాగిరెడ్డి బావ, మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి "ఇంకా వాడంటే మీకు భయమెందుకు? జనాన్ని చూడనివ్వండి" అని కేకలేయటంతో ప్రజల్ని అనుమతించారు. పోస్టుమార్టం అనంతరం కల్లూరు నుంచి వేలాది జనం వెంటరాగా తరిమెల వరకు అంతిమయాత్ర సాగింది. నాగిరెడ్డి అర్ధ శతాబ్ది వర్ధంతి సభలు ఈ సంవత్సరంపాటు జరిపి ఆ గొప్ప కమ్యూనిస్టు స?ఫూర్తిని నిలపాలని ఆయన సహచరులు, అనుచరులకు మనవి చేస్తున్నాను.

# గులకరాయి నిందితుడు అదృశ్యం

## వారం రోజులుగా కనిపించని సతీష్.. కేసు నమోదు



విజయవాడ,జూలై 28(టుడే విదుర):జగన్ సీఎంగా ఉన్నప్పుడు, ఆయపై గులకరాయితో జరిగిన దాడి కేసులో నిందితుడిగా ఉన్న విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన వేముల సతీష్ అదృశ్యమయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచారం చేస్తుండగా జగన్‌కు, పక్కనే ఉన్న అప్పటి సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాసరావుకు ఓ చిన్న రాయి తగిలింది. ఈ కేసులో వేముల సతీష్‌ను ఏ2గా నిర్ధారించి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్దిరోజుల క్రితం వరకు ఇంటి వద్ద ఉన్న సతీష్ వారం రోజులుగా కనిపించడం లేదు. ఓ బాలికతో ఉన్న ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు చెబుతున్నారు. సతీష్ స్థానికంగా ఓ బాలికను ప్రేమించాడు. తల్లిదండ్రులు లేని బాలిక మేనత్త వద్ద ఉంటోంది. సతీష్ ప్రేమ వ్యవహారం తెలిసిన బాలిక మేనత్త, ఈ నెల 20వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సతీష్‌ను, అతడి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించారు. దీంతో అతడి ప్రేమ విషయం ఇంట్లో తెలిసిపోయింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. దీనిపై కుటుంబ సభ్యులు సతీష్‌ను మందలించారు. అప్పటి నుంచి అతడు కనిపించడం లేదు. ఇంట్లోనే ఫోన్ వదిలిపెట్టి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడేమోనని అక్కడ గాలించినా సతీష్ ఆచూకీ లభించలేదు. పోలీసులు అతడి కోసం పది మంది సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సతీష్ అదృశ్యమైన విషయం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది.

# గ్రంథాలయ పరిషత్‌కు సభ్యుల నియామకం




అమరావతి, జూలై 28(టుడే విదుర): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు నలుగురు సభ్యులను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.సోమశేఖరరావు, విజయనగరానికి చెందిన రిటైర్డ్ సూపరింటెండెంట్ రౌతు రామమూర్తి, గుంటూరుకు చెందిన మగతాల పద్మజ, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ వీఆర్ రాసని సభ్యులుగా నియమితులయ్యారు.

# 4.50 కిలోల బాలభీముడు



ఇంటర్నెట్ డెస్క్:జూలై 28(టుడే విదుర): సాధారణంగా పిల్లలు 2.5 నుంచి 3.5 కిలోల బరువుతో జన్మిస్తారు. అటువంటిది కర్నూలు జిల్లా కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో 4.50 కిలోల బరువుతో బాలుడు జన్మించి, అందరినీ ఆశ్చర్యపరిచాడు. గోనెగండ్ల మండలం వేముగోడుకు చెందిన భారతికి పురిటి నొప్పులు రావడంతో భర్త నల్లన్న ఆస్పత్రిలో చేర్చారు. వైద్యాధికారి నాగరాజు పర్యవేక్షణలో డాక్టర్ పుష్పలత ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

# విద్యార్థినుల పట్ల పీఈటీ దాష్టీకం

## అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

## అస్వస్థతకు గురైన పలువురు విద్యార్థినులు




కోట,జూలై 28(టుడే విదుర):: వైట్ యూనిఫాం ధరించలేదని విద్యార్థునుల పట్ల వ్యాయామ ఉపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తించారు. ఒక్కో విద్యార్థిని చేత 150 గుంజిళ్లు తీయించాడు. బూతులు తిడుతూ కర్రతో వాతలు తేలేలా చితకబాదాడు. ఈ విషయం బయటకు పొక్కనివ్వకుండా దాచినప్పటికీ పీఈటీ కొట్టిన దెబ్బలకు నొప్పులు తాళలేక విద్యార్థినులు విలపిస్తూ వార్డెన్‌కు చెప్పారు. ఇంతలో కొంతమంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కోట ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఎస్సీ బాలికల వసతిగృహంలో 160 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరంతా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తగరతుల వరకు చదువుకుంటున్నారు. ఉదయం రోజూలాగే గ్రీన్ యూనిఫారం ధరించి పాఠశాలకు వెళ్లారు. ప్రార్థన సమయంలో వైట్ యూనిఫాం వేసుకురాని విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ ప్రశ్నించారు. ఇప్పటివరకు హాస్టల్‌లో వైట్ యూనిఫారం ఇవ్వలేదని విద్యార్థినులు చెప్పడంతో కోపోద్రిక్తుడైన వ్యాయామ ఉపాధ్యాయుడు 60మంది హాస్టల్ విద్యార్థినుల చేత 150 గుంజిళ్లు తీయించాడు. అంతేకాకుండా కర్రతో ఆ విద్యార్థినులను కాళ్లమీద, వెనుక భాగంలో తీవ్రంగా కొట్టాడు. కన్నీటి పర్యంతమైన విద్యార్థినులు సాయంత్రం 5 గంటలకు హాస్టల్‌కు వెళ్లారు. రాత్రి అయ్యేసరికి పీఈటీ మాస్టర్ కొట్టిన దెబ్బలకు కాళ్లు, తొడలు వాచిపోయి నొప్పులు భరించలేక విద్యార్థినులు ఏడ్పులు మొదలుపెట్టారు. విచారించిన వార్డెన్ ఉషారాణి హెచ్‌ఎం భారతిని, పాఠశాలలోని ఉపాధ్యాయులను ప్రశ్నించినా సక్రమంగా సమాధానం చెప్పలేదు.

# రిజర్వేషన్ గల్లంతు

AP EAPCET 2025

జూలై 28(టుడే విదుర)::ఒక కళాశాలలో సీఎసఈ ఓసీ జనరల్ కటాఫ్ ర్యాంకు 12,227. కానీ, అంతకంటే మెరుగైన ర్యాంకులు వచ్చిన 30 మంది విద్యార్థినులకు, అంతకంటే మెరుగైన ర్యాంకులు వచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జనరల్ కోటాలో సీట్లు రాలేదు. వారికి ఓసీ జనరల్ కటాఫ్ కంటే మెరుగైన ర్యాంకు వచ్చినప్పటికీ ఈఏపీ సెట్లో మెరిట్ కోటాలో సీటు దక్కలేదు. వారికి సంబంధించిన రిజర్వేషన్ కోటాలోనే సీటు వచ్చింది. కేవలం కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కొన్ని వేల మంది విద్యార్థుల తలరాతలు మార్చేస్తోంది. గత ప్రభుత్వం నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల ఎంపికతో మొదలైన రిజర్వేషన్ తొలగింపు ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది.గుంటూరు, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ(ఈఏపీ) సెట్‌కు సంబంధించి చేపట్టిన వెబ్ కౌన్సెలింగ్ వేలాది మంది విద్యార్థుల తలరాతలు మార్చేస్తోంది. ఈఏపీ సెట్లో సీట్ల కేటాయింపు నిమిత్తం చేపట్టిన వెబ్ కౌన్సెలింగ్‌లో 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' గల్లంతైంది. తాజాగా జరిగిన తొలి విడత వెబ్ కౌన్సెలింగ్‌లో అనేక లోపాలు బయటబడ్డాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ విషయంలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యం రిజర్వేషన్ వర్తించే విద్యార్థులకు శాపంగా మారింది. తొలివిడత కౌన్సెలింగ్‌లో విడుదలైన సీట్ అలాట్‌మెంట్ జాబితా జనరల్ కోటా అర్థం మారిపోయింది. జనరల్ కోటాలో సీట్లు మొత్తం బాలురకే కేటాయించారు. 'జనరల్' అంటే పురుష, స్త్రీ అన్న వ్యత్యాసం లేకుండా ఎవరికైనా మెరిట్ ఆధారంగా కేటాయించాలి. కానీ, జనరల్ కోటా సీట్లలో 80 శాతం సీట్లు బాలురకే కేటాయించారు. పురుషుల కోటాలో లాస్ట్ కటాఫ్ ర్యాంకు వచ్చిన అభ్యర్థికంటే మెరుగైన ర్యాంకుల వచ్చిన 80 శాతం మంది విద్యార్థినులను జనరల్ కోటాలోకి తీసుకోకుండా, వారికి బాలికల కోటాలో సీట్లు ఇచ్చారు. ఫలితంగా వేల మంది విద్యార్థినులకు అన్యాయం జరిగింది.

## ఆందోళన కలిగిస్తున్న బదిలీల ప్రక్రియ



జూలై 28(టుడే విదుర):ఆందోళన కలిగిస్తున్న బదిలీల ప్రక్రియస్థలో బదిలీల ప్రక్రియ ప్రభుత్వ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రామవెహాన్ గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజకీయ నేతలు తమ స్వీయ అస్తిత్వం కోసం ఉద్యోగుల బదిలీల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. బదిలీల కోసం అధికారుల వద్దకు వెళ్తున్న ఉద్యోగులను ఎమ్మెల్యేల లెటర్లు ఉన్నాయా అని అడిగే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన వేదిక లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని సవరించి, పార్లమెంట్‌లో చట్టంచేసి ఏర్పాటుచేసిన అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కొనసాగుతుండగా, గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఉద్యోగులకు రూ.25 వేల కోట్లకు పైగా ఉన్న వివిధ రకాల ఆర్థిక బకాయిల చెల్లింపునకు ఒక ప్రణాళిక ప్రకటించాలని తీర్మానించారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లోని జీపీఎఫ్ బకాయిలు, గత ప్రభుత్వంలో ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో నుంచి అక్రమంగా తీసుకున్న రూ.500 కోట్లపై విచారణ నివేదికను బహిర్గతం చేయాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. లోపభూయిష్టంగా ఉన్న విధానాన్ని రద్దుచేసి పారదర్శకమైన ఏకరీతి నిర్దిష్టమైన బదిలీ విధానాన్ని రూపొందించాలని తీర్మానించారు. ప్రధాన ఉద్యోగ సంఘానికి ప్రతి ఉద్యోగీ నేరుగా ఓటు వేసి ఎన్నుకునేలా ప్రభుత్వమే ఒక ఎన్నిక విధానాన్ని చట్ట నిబంధనల ప్రకారం తీసుకురావాలని తీర్మానించారు. ఈ సమావేశంలో జేఏసీ కో-చైర్మన్ కె.హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాజీ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పట్టాలతో.. ప్రభుత్వ భూమి హాంఫట్

ఆక్రమణకు గురైన సైలాడ కొండ ప్రాంతం
సైలాడ కొండ ప్రాంతం ఆక్రమణకు యత్నం
పరిసరాల్లోని గ్రామస్థుల ఆందోళన
ఎమ్మెల్యే, అధికారులకు ఫిర్యాదు



ఆమదాలవలస,జూలై 28(టుడే విదుర): ప్రభుత్వం మారినా.. భూ దందాలు మాత్రం ఆగడం లేదు. వైసీపీ పాలనలో కొండలు, గుట్టలు, కాలువలు, ప్రభుత్వ భూములు సైతం ఆక్రమణకు గురయ్యాయి. అప్పట్లో నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలతో భూ అనుమతులు సృష్టించిన వ్యక్తులు.. ఇప్పటికీ ఆక్రమణలు కొనసాగించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆమదాలవలస మండలం చిట్టివలస ప్రాంతంలోని సైలాడ రెవెన్యూ గ్రామంలో కొండను ఆక్రమించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ప్రభుత్వం తనకు డీ పట్టా మంజూరు చేసిందని స్థానికులను నమ్మిస్తూ.. సైలాడ కొండను ఆక్రమించాలని భావించాడు. దీంతో పరిసర గామాలైన గాజులకొల్లివలస, చిట్టివలస, సైలాడకు చెందిన ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆక్రమణల వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ గ్రామాలకు చెందిన సవర చిన్నారావు, బంటుపల్లి కూర్మారావు, సూలు లక్ష్మణ, భోగి నాగరాజు, లబ్బ రమణ, పి.సూరి, ఎర్రంనాయుడు, శ్రీను తదితరులు ఆమదాలవలస రెవెన్యూ కార్యాలయంలో కూడా గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'రెవెన్యూ సర్వే నెంబర్ 183 కలిగిన సైలాడ కొండ ప్రాంతంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు 294, 295-2, 296-1, 296-3 కలిగిన తప్పుడు సర్వే నెంబర్లతో గతంలో డీ పట్టాలు మంజూరు చేసినట్టు తెలిసింది. తప్పుడు సర్వే నెంబర్లు, నకిలీ పట్టాతో ఓ అక్రమార్కుడు సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి పనులు ప్రారంభించాడు. సైలాడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఎఫ్ఎంబీలు 292, 293 వరకు మాత్రమే ఉన్నాయి. అటువంటప్పుడు 296 సర్వే నెంబర్ ఎక్కడ నుంచి పుట్టుకొచ్చిందని ప్రశ్నించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి నకిలీ పట్టాలను రద్దు చేయడంతోపాటు ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఆ ప్రాంతమంతా టెపో గ్రాఫికల్ సర్వే చేసి ఇప్పటివరకు ఉన్న సర్వే నెంబర్లు ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. నకిలీ పట్టాదారుడుకు వత్తాసు పలుకుతూ.. అతని పట్టాలో ఉన్న సర్వే నెంబర్లు మార్చిడి చేస్తే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఏపీ ఎన్జీవో మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలి



విజయవాడ (గాంధీనగర్), జూలై 28(టుడే విదుర): ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహిళా విభాగాన్ని తాలూకా స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ విభాగ రాష్ట్ర చైర్‌పర్సన్ వి.నిర్మలాకుమారి, కన్వీనర్ పి.మాధవి పిలుపునిచ్చారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో సంఘ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉద్యోగుల సమస్యలు, వేతనాలు, పెండింగ్ అంశాలు, విధుల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు.. తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైల్డ్‌కేర్ లీవ్‌ను సద్వినియోగం చేసుకునే విషయంలో...జీవోలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను సవరించాలని, స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మహిళా విభాగాన్ని పటిష్టపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తీర్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు జూమ్ సమావేశాల నుంచి మినహాయింపు ఇవ్వాలని, వారిపై పనిభారాన్ని తగ్గించాలని, పని ప్రదేశాల్లో ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు.

## అనకాపల్లి ఆస్పత్రిలో 22 మందిపై విచారణ




అమరావతి, జూలై 28(టుడే విదుర): అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రిలో గతంలో పలు అక్రమాలకు పాల్పడిన 22 మందిపై త్వరితగతిన విచారణ చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. 2020 ఫిబ్రవరి లో ఈ ఆస్పత్రిలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గుర్తించిన పలు అక్రమాలపై ఏసీబీ సమర్పించిన నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు అనుమతిచ్చినట్టు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అప్పటి డీసీహెచ్ఎస్‌తోపాటు తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సుల అక్రమాలపై శీఘ్రంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఆ ఆస్పత్రిలో లైసెన్స్ లేకుండా క్యాంటీన్ నిర్వహణ, భోజనం అందించాల్సిన రోగుల వివరాల్ని తెలపకపోవడం, ఆహార సరఫరా నాణ్యత పట్ల నిర్లక్ష్యంతోపాటు విధి నిర్వహణలో పూర్తిగా విఫలం కావడంతో వీరిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఏసీబీ సిఫారసు చేసింది.

## కన్యాకుమారి-పూణె జయంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో అకస్మాత్తుగా పొగలు



ఇంటర్నెట్ డెస్క్‌జూలై 28(టుడే విదుర): కన్యాకుమారి, పూణెల మధ్య నడిచే జయంతి ఎక్స్‌ప్రెస్‌లో సడెన్‌గా పొగలు రావడం కలకలానికి దారితీసింది. పొగలు కమ్ముకోవడం చూసి ప్రయాణికులు ఏం జరుగుతోందో అర్థంకాక తీవ్ర భయాందోళనలకు లోనయ్యారు. అన్నమయ్య జిల్లా నందలూరు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఏసీ బోగీ కింద భాగం నుంచి పొగలు రావడాన్ని గమనించిన కొందరు ప్రయాణికులు వెంటనే అప్రమత్తమై గార్డుకు సమాచారం అందించారు. దీంతో, సిబ్బంది రైలును నందలూరు వద్ద నిలిపివేశారు. అనంతరం బోగీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైలు బ్రేకుల వద్ద నుంచి పొగలు వచ్చినట్టు గుర్తించారు. మరమ్మతుల తరువాత రైలు గమ్యస్థానానికి బయలుదేరింది.

## నేటి నుంచి అమరవీరుల వారోత్సవాలు



చింతూరు,జూలై 28(టుడే విదుర):సోమవారం నుంచి మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేరిట లేఖ విడుదలైంది. ప్రతిఏటా మాదిరిగా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించ తలపెట్టినట్లు వివరించారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, పార్టీని విప్లవోద్యమాన్ని కాపాడుకుందామని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో ఏపీలోని అల్లూరి జిల్లా చింతూరు డివిజను పోలీసులు అప్రమత్తమయ్యారు. అనుమానిత ప్రదేశాల్లో నిఘా పెంచారు. వాహనాలను నిలువరించి తనిఖీలు చేస్తున్నారు. రాత్రి వేళలో చింతూరు వైపు నుంచి భద్రాచలం వైపు సాగే రాకపోకలను వయా కూనవరం మీదుగా మళ్లిస్తున్నారు. ఇందులోభాగంగా విజయవాడ జగదల్‌పూర్ జాతీయ రహదారిపై పోలీసులు గట్టి పహారా కాస్తున్నారు.

## గ్రేటర్‌లో చికెన్ వ్యర్థాల లొల్లి




జూలై 28(టుడే విదుర):మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ)లో చికెన్‌వ్యర్థాల సేకరణ వివాదం రోజురోజుకి ముదురుతోంది. చికెన్ వ్యర్థాలకు చేపల పెంపకందార్ల నుంచి భారీ డిమాండ్ ఉండడంతో వ్యర్థాల సేకరణకు జీవీఎంసీ నుంచి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లతోపాటు కొందరు ప్రైవేటు వ్యక్తులు పోటీపడుతున్నారు. ఇరువర్గాలకు కూటమి నేతల అండదండలు ఉండడంతో ఒకరి వాహనాలను ఒకరు పట్టుకుని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. డంపింగ్‌యార్డుకి కాకుండా చేపలచెరువులకు వ్యర్థాలను తరలించే వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇది జీవీఎంసీ కార్పొరేటర్లు, అధికారుల్లో నిత్యం వివాదాలకు కారణంగా మారుతోంది.జీవీఎంసీ పరిధిలో చికెన్ దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను గెడ్డలు, రోడ్లపై పడేస్తుండడం వల్ల పారిశుధ్యలోపంతో పాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. దీనిని గుర్తించిన జీవీఎంసీ అధికారులు నగరంలోని చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను వాహనంలో సేకరించి, కాపులుప్పాడలోని డంపింగ్‌యార్డుకి తరలించేందుకు రెండేళ్లకొకసారి టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. చికెన్ వ్యర్థాలను చేపల చెరువుల్లో వేయడం వల్ల చేపలు తక్కువకాలంలోనే ఎక్కువ బరువు పెరుగుతున్నట్టు చేపలపెంపకందారులు గుర్తించారు. దీంతో అనకాపల్లి, దేవరాపల్లితోపాటు ఉభయగోదావరి జిల్లాల్లోని చేపల చెరువుల యజమానులు నగరంలో చికెన్‌వ్యర్థాలను సేకరించేవారిని సంప్రదించారు. వ్యర్థాలను సరఫరా చేస్తే భారీగా డబ్బు ఇవ్వడానికి అంగీకరించడంతో కాంట్రాక్టర్లు వ్యర్థాలను డంపింగ్‌యార్డుకి కాకుండా చేపల చెరువులకు విక్రయించడం మొదలుపెట్టారు. కొన్నాళ్లు ఈ వ్యవహారం గుట్టుగానే జరిగినప్పటికీ చికెన్‌వ్యర్థాలకున్న డిమాండ్ బయటకు తెలిసింది.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్



పరవాడ, జూలై 28(టుడే విదుర):పరవాడ- లంకెలపాలెం ప్రధాన రహదారిలో సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన కొండపురెడ్డి రామిరెడ్డి (39) కొన్నేళ్ల నుంచి పరవాడ ఫార్మాసిటీలోని రాంకీకి చెందిన కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ (సీడబ్ల్యూఎంపీ)లో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలిసి విశాఖ నగరంలోని కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్నాడు. రోజు మాదిరిగానే సాయంత్రం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. ఫార్మా సిటీలోని లారస్ ల్యాబ్స్ ఫార్మా పరిశ్రమ సమీపంలోకి వెళ్లేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. దీంతో కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి వివరాలు సేకరించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు.

# పలాస అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్



◆ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ వ్యూ ◆ భవిష్యత్ అవసరాల దృష్ట్యా మునిసిపాలిటీలో మార్పులు
◆ కొత్తగా 21 రెవెన్యూ గ్రామాలు చేరిక ◆ గెజిట్ నోటిఫికేషన్‌పై అభిప్రాయాల స్వీకరణ

పలాస,జూలై 28(టుడే విదుర): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీని సుడా(శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ) పరిధిలోకి తీసుకువచ్చి 2046 సంవత్సరం వరకూ అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి చేయనుంది. దీనికి సంబంధించి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఇటీవల గెజిట్ నోటీఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లోగా ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పేందుకు గడువు విధించారు. అనంతరం మాస్టర్‌ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. జిల్లాకేంద్రమైన శ్రీకాకుళం తర్వాత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గను పూర్తిస్థాయిలో పట్టణీకరించేందుకు ఈ మాస్టర్‌ప్లాన్ ఎంతో దోహదం చేస్తుంది.ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ పరిధిలో మొత్తం 25 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మాస్టర్‌ప్లాన్‌లో కొత్తగా 21 రెవెన్యూ గ్రామాలను చేర్పించారు. అందులో కైజోల, సున్నాడ, శాసనం, రాజగోపాలపురం, కంబిరిగాం, ఈదురాపల్లి, కేదారిపురం, సొగిడియా, పండాశాసనం, బ్రాహ్మణతర్లా, అనంతగిరి, కిష్టుపురం, లక్ష్మిపురం, గరుడఖండి, బట్టుపాడు, మహదేవపురం, గోపాలపురం, నగరంపల్లి, పెద్దబడాం, రాజాం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో మాస్టర్‌ప్లాన్ కింద వస్తాయి. ఇప్పటికే దీనికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి సుడా పట్టణాభివృద్ధిలోకి తీసుకురానున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా 20, 40 అడుగుల వెడల్పుతో రహదారులు నిర్మాణం జరగనున్నాయి. మొత్తం ఈ ప్రాంతాలన్నీ జోన్లవారిగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. రెసిడెన్సియల్ కాంప్లెక్స్‌లు, పారిశ్రామికవాడలు, కమర్షియల్ ప్రాంతాలు, అగ్రికల్చర్ జోన్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు, పెట్రోలు బంకులు మొత్తం అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. పథకమంతా జాతీయరహదారికి అనుసంధానం చేసి గ్రామాలు, పట్టణాభివృద్ధి జరిపేందుకు పొందిపరిచారు. ఇప్పటికే పలాస-కాశీబుగ్గ.. జీడి పారిశ్రామికవాడగా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన విషయం విధితమే. మన జీడిపప్పుకు జాతీయస్థాయి అవార్డు కూడా లభించింది. ఈ నేప?థ్యంలో మాస్టర్‌ప్లాన్ భవిష్యత్ అవసరాలకు అమలైతే జిల్లాకేంద్రం తరువాత ఆ స్థాయిలో జంట పట్టణాలు సుందరీకరణకు అవకాశం ఉంటుందని జంట పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.భవిష్యత్ అవసరాలకు పలాస-కాశీబుగ్గ అభివృద్ధి చేయడం ఎంతో అవసరం ఉంది. శరవేగంతో పట్టణీకరణ జరుగుతున్న సమయంలో మాస్టర్‌ప్లాన్ అమలైతే విశాలమైన రహదారులు, ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి జరుగుతుంది. దీనికి సంబంధించి ముసాయిదా ఇప్పటికే విడుదల చేశాం. ప్రజల అభ్యంతరాలు స్వీకరించి దానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తాం.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి




గుంటూరు(తూర్పు)జూలై 28(టుడే విదుర):కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాలతో రాష్ట్రంలో పెన్షన్‌దారులకు సమస్యలు ఎదురవుతున్నాయని, పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ రూరల్ డెవల్‌పమెంట్ అండ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఎంబీ బుచ్చిరాజు కోరారు. గుంటూరులో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వేతన విభజన చట్టాల ముసుగులో జరుగుతున్న వర్గీకరణ మూలంగా విశ్రాంత ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 12వ వేతన సవరణ పూర్తి స్థాయిలో అమలు కావాలని, మధ్యంతర భృతి 35 శాతం, 12వ పీఆర్సీలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 315 సవరణ ద్వారా భార్యాభర్తలకు కుటుంబపెన్షన్ వర్తించేలా మార్పు లు చేయాలని కోరారు. అమరావతిలో పెన్షన్‌దారుల భవనం నిర్మించాలని కోరారు.

# పిచ్చికుక్క స్వైరవిహారం




%కోటబొమ్మాళి, జూలై 28(టుడే విదుర): జర్జంగి పంచాయతీ గుంజిలోవ గ్రామం లో వేకుమజామున పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. దీంతో ఇద్దరు వ్యక్తులతోపాటు తొమ్మిది ఆవులకు, నాలుగు ఎద్దులు, మూడు దూడలు గాయపడ్డాయి. ఇంటిముందు కట్టిన ఈ పశువులతోపాటు ఆరుబయట నిద్రిస్తున్న తర్లింగి బారికప్పయ్య, తిర్లింగి మోహనరావులపై పిచ్చికుక్క దాడి చేసింది గాయపడిన వీరిద్దరూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అలాగే గాయపడిన పశువులకు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ వైద్యం అందించారు.

# వర్షం వస్తే ఆ రోడ్డు అంతే..?



కాశినాయనజూలై 28(టుడే విదుర):ఓబుళాపురం-వరికుంట్ల రోడ్డు అస్తవ్యస్తం గా మారింది. కొద్దిపాటి వర్షం వచ్చినా రోడ్డుపై నీరు నిలిచి కుంటను తల పిస్తోంది. జ్యోతికి పోయే భక్తులు, 15 గ్రామాల ప్రజలు నిత్యం ఈరోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ వందల సంఖ్యలో బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ఈరోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటాయి. 3సంవత్సరాల క్రితం రూ.9 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో డబుల్ రోడ్డు మంజూరు కావ డంతో అందరూ ఈరోడ్డుకు మహర్ధశ పట్టిందనుకున్నారు. కానీ ప్రస్తుతం ఈరోడ్డు పరిస్థితి అనుకున్న దొక్కటి అయ్యింది ఇంకొక్కటి అన్నట్లుగా ఉంది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ సగంలోనే పనులు ఆపివేయడంతో రోడ్డు పరిస్థితి ఎటూమారని విధంగా తయారైంది. 12 కిలోమీటర్ల పొడవున్న ఈరోడ్డుపై దాదాపు 14 మలుపులు ఉన్నాయి. దాదాపు రెండు సంవత్సరాల క్రితం వరికుంట్ల నుంచి మిద్దెల ఎస్సీకాలనీ వరకు 8 కి.మీ మేర పనులు జరిగాయి. పనులు చేసినప్పటికీ ప్రస్తుతానికి ప్రతి మలుపువద్ద ఎదురుగా వచ్చే వాహనం కన్పించనంతగా ముళ్లకంప రోడ్డుపైకి చొచ్చుకొనివచ్చింది. మలుపులవద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. దీంతో మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కన్పించక తరచూ ప్రమాదాలు జరుగుతు న్నాయి. మరోవైపు మండల కేంద్రమైన నర్సాపురం మీదుగా ఓబుళాపురం నుంచి మిద్దెల వరకు పనులు నిలిచి పోయిన 4 కి.మీ రోడుపై ఎక్కడ పడితే అక్కడ అడుగు నుంచి రెండు అడు గులమేర గుంతలు ఏర్పడి చిన్న పాటి వర్షం వచ్చి నా కుంటను తలపించేలా ఉండ డంతో ప్రయాణికులు ఇబ్బం దు లు పడుతున్నారు. ఎక్కడైనా ప్ర ధాన రోడ్లపై గుంతలు ఏర్పడితే సంబంధిత అధికారులు ముందు కొచ్చి కంకర పోసి ప్ర యాణికు లు అసౌకర్యానికి గురి కాకుండా చూసేవారు. ఎందుకో ఈ రోడ్డు గురించి పట్టిం చుకోక పోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారు లు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయిం చి మలుపుల వద్ద సూచిక బోర్డుల ఏర్పాటుతోపాటు కంప చెట్లను తొలగించాలని ప్రజ లు కోరుతున్నారు.

# పేదల కడుపు కంది..నది!



జూలై 28(టుడే విదుర):చాలా కాలంగా పేదింటికి కందిపప్పు దూరమైంది..గత వైసీపీ ప్రభు త్వంలో కందిపప్పు సరఫరా నిలిచిపోయింది..ఆ ప్రభు త్వంలో ఇచ్చినా అరకొరగానే ఉండేది.అయితే కూటమి ప్రభుత్వంలో కందిపప్పు తప్పనిసరిగా సరఫరా చేస్తారని అంతా ఆశిం చారు. అయితే అదీ నిరాశగానే మారింది. ఎందు కంటే గత నాలుగు నెలలుగా రేషన దుకాణాల్లో కందిపప్పు పంపిణీ జరగడం లేదు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15 లక్షల రేషనకార్డులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 6 లక్షల 54 వేల రేషనకార్డులు ఉన్నాయి. వీరికి నెలకు 300 మెట్రిక్ టన్నులు కందిపప్పు కేటాయించాలి. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో 3 లక్షల 75 వేల రేషనకార్డులు ఉన్నాయి.వీరికి 200 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలి.తూర్పుగోదావరి జిల్లాలో 5 లక్షల రేషన కార్డులు ఉన్నాయి.వీరికి 300 మెట్రిక్ టన్నులు కావాలి. మొత్తంగా మూడు జిల్లాలకు కలిపి 800 మెట్రిక్ టన్నులు కందిపప్పు పంపిణీ నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత కాలం క్రమం తప్పకుండా కందిపప్పును ప్రజా పంపిణీ వ్యవస్థలో అందజేసింది. కానీ నాలుగు నెలలుగా కం దిపప్పు సరఫరా నిలిచిపోయింది. అమరావతిలో కంది పప్పు టెండర్లు ఖరారు కాకపోవడంవల్ల సరఫరా నిలిచి పోయిందని అధికారులు అంటున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు ఎప్పుడు సరఫరా అవుతుందో చెప్పలేక పోతు న్నారు. రేషన దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.67కే లబ్ధిదా రులకు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కె ట్‌లో కిలో రూ.100 నుంచి రూ.110 వరకు ధర పలుకుతోంది. ఆగస్టులోనైనా పంపిణీ జరుగుతుం దని లబ్ధిదారులు ఆశగా చూస్తు న్నారు. వచ్చే నెలలో కూడా కందిపప్పు సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదని అధికారులు అంటు న్నారు.గత వైసీపీ ప్రభు త్వంలో ఒక నెల కంది పప్పు ఇస్తే రెండు నెలలు కోత విధించేవారు.కూటమి ప్రభు త్వం వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా పంపిణీ చేసినప్పటికీ నాలుగు నెలలుగా కంది పప్పు సరఫరాకావడంలేదు.

# గజదాడులతో ఇంకెవరి ప్రాణాలూ పోకూడదు

సోమల/పుంగనూరు,జూలై 28(టుడే విదుర):: గజదాడులతో ఇంకెవరి ప్రాణాలు పోకుండా రక్షణ కల్పించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని చిత్తూరు డీఎఫవో ఎస్.భరణిని పలువురు గ్రామస్తులు కోరారు. రాత్రి సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ కొత్తూరుకు చెందిన సి.శ్రీరామరాజు కుమారుడు సి.రామకృష్ణమరాజు(46)ను పొలం వద్ద 16 ఏనుగుల గుంపు దాడి చేసి.. తొక్కి చంపేసిన విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే రామకృష్ణమరాజును ఏనుగులు తొక్కి చంపాయని ఆరోపిస్తూ మృతదేహాన్ని శవపరీక్షకు తరలించకుండా గ్రామస్తులు ఉదయం వరకు ఆందోళన కొనసాగించారు. విషయం తెలుసుకున్న డీఎఫవో భరణి.. ఫారెస్టు, పోలీసు, రెవెన్యూ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి గ్రామస్తులు, బాధిత కుటుంబీకులతో చర్చించారు. ఈసందర్భంగా రైతులు ఆమెతో మాట్లాడుతూ.. పదేళ్లుగా ఏనుగుల గుంపుతో పంటలు నష్టంతోపాటు రైతులు, పశువుల కాపర్లు ప్రాణాలు కోల్పోతున్నారని, తమకు ఏనుగుల బెడద ఎప్పుడు తీరుతుందని ప్రశ్నించారు. మూడ్రోజులుగా రాంపల్లె బీట్, కొత్తూరు, పట్రపల్లె ప్రాంత ంలో 16 ఏనుగుల గుంపు తిష్ఠ వేసి రైతులను ఇబ్బందులు పెడుతున్నట్లు స్థానికులు వివరించారు. ఏనుగుల దాడులతో టమోటా, మామిడి, వరి పంటలు కోల్పోతున్నామని రైతులు వాపోయారు. ప్రభుత్వం అందించే నష్ట పరిహారం తక్కువన్నారు. ఇకనైనా ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పిస్తూ.. అటవీ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఇక రామకృష్ణమరాజు కుటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని, భార్య రాధిక, కుమార్తెలు గాయత్రీ, నిఖిత, కుమారుడు గణేశ్ దిక్కులేని వారయ్యారన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పీ-4 పథకం ద్వారా మృతుడి కుటుబాన్ని అన్నిరకాలుగా ఆదుకోవాలని విన్నవించారు. కుటుంబీకులు, గ్రామస్తుల చెప్పిన విషయాలను కలెక్టర్, అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని డీఎఫవో హామీ ఇవ్వడంతో రామకృష్ణమరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం (పీఎం)కు తీసుకెళ్లడానికి అంగీకరించారు.

# నిండుకుండలా సాగర్



విజయపురిసౌత్ జూలై 28(టుడే విదుర):నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లు తెరిచేందుకు ప్రాజెక్ట్ అధికారులు రంగం సిద్ధం చేశారు. శ్రీశైలం నుంచి 120339 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా సాగర్ జలాశయానికి వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం గణనీయంగా పెరుగుతూ గరిష్టమటానికి ఏడు అడుగులు చేరువలో ఉంది. దీనితో నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు వరద నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉన్నారు. ఏ సందర్భంలోనైనా సాగర్ గేట్లను తెరిచేందుకు సిద్ధంగా ఉన్నారు. సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు గాను ఆదివారం సాయంత్రానికి 583 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 291.3795 టీఎంసీలకు చేరింది.

# తెలంగాణలో భారీ అగ్నిప్రమాదం




రంగారెడ్డి జిల్లా:జూలై 28(టుడే విదుర): రాచకొండ కమిషనరేట్ బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి బాబానగర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం జరగడంతో మంటలు దట్టంగా వ్యాపించాయి. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక అధికారులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక అధికారులు చేరుకొని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. స్థానికులని సంఘటన స్థలం నుంచి దూరంగా పంపించి వేస్తున్నారు.అయితే ఈ ప్రమాదంలో ఏలాంటి ప్రాణనష్టం జరగలేదని.. కానీ ఆస్తి నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. ఎంతవరకు ఆస్తి నష్టం జరిగిందనేది తెలియాల్సి ఉంది. ప్లాస్టిక్ కంపెనీ కావడంతో మంటలు త్వరగా వ్యాపించినట్లు తెలుస్తోంది. ఈ కంపెనీలో ఉన్న ప్లాస్టిక్ దానా మంటల్లో కాలి బుడిదైంది. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం అయింటుందా..? లేదంటే ఇంకా ఏదైనా కారణలు ఉన్నాయా..? అనే పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఇటీవల వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బీటెక్ బయో టెక్నాలజీలో మరిన్ని సీట్లకు అనుమతి



హైదరాబాద్, జూలై 28(టుడే విదుర): బీటెక్‌లో బయో టెక్నాలజీ కోర్సులో మరిన్ని సీట్లకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ కోర్సులో రాష్ట్రవ్యాప్తంగా 330 సీట్లే ఉన్నాయి. ఇందులో 273 సీట్లను కన్వీనర్ కోటాలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. సీట్ల సంఖ్య పెంచాలని ఇప్పటికే చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటెక్‌లో బయో టెక్నాలజీ సీట్లు ఎక్కువగా ఉన్నాయని, బీటెక్‌లో మాత్రం తక్కువగా ఉన్నాయని తెలిపారు.

# తెలంగాణలో 348 వడదెబ్బ కేసులు



న్యూఢిల్లీ, జూలై 28(టుడే విదుర): దేశవ్యాప్తంగా ఈ ఏడాది 7,192 మంది వడదెబ్బకు గురవ్వగా.. 14 మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్రాల వారీగా తెలంగాణలో 348 కేసులు నమోదవ్వగా.. ఆంధ్రప్రదేశ్‌లో 4,055, రాజస్థాన్‌లో 373, ఒడిశాలో 350, మధ్యప్రదేశ్‌లో 297 వడదెబ్బ కేసులు రికార్డయ్యాయి. సమాచార హక్కు చట్టం దరఖాస్తుకు ఇచ్చిన సమాధానంలో ఎన్‌సీడీసీ (వ్యాధుల నియంత్రణ జాతీయ కేంద్రం) మార్చి 1వ తేదీ నుంచి జూన్ 24వ తేదీ వరకు నమోదైన వివరాలను వెల్లడించింది.ఇంకా అనేక రాష్ట్రాల్లోనూ వందకుపైగా వడదెబ్బ కేసులు నమోదైనప్పటికీ ఆ రాష్ట్రాల్లో మరణాలు రికార్డవ్వలేదు. మహారాష్ట్ర, ఉత్తరాఖండ్‌లలో ముగ్గురేసి చొప్పున వడదెబ్బకు ప్రాణాలు కోల్పోగా.. తెలంగాణ, ఒడిశా, ఝార?ండ్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. వాస్తవంగా వడదెబ్బ బాధితుల సంఖ్య ఇంతకంటే చాలా ఎక్కువే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆస్పత్రుల్లో నమోదైన కేసుల సమాచారాన్ని మాత్రమే ఎన్‌సీడీసీ వెల్లడించిందంటున్నారు.

# ఇల్లు సరే.. పెండింగ్ బిల్లులూ మంజూరు చెయ్యండి



అక్కన్నపేట, జూలై 28(టుడే విదుర): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మైసమ్మవాగుతండా తాజా మాజీ సర్పంచ్ సందేబోయిన లావణ్య తనకు రావాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాడుబడిన స్కూల్ భవనంలో ఆశ్రయం పొందుతున్న తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేసిన ఆమె.. పెండింగ్ బిల్లులపై ఎలాంటి హామీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు రూ.10 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని వివరించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇల్లు నమోదుకు వచ్చిన అధికారులు పెండింగ్ బిల్లులపై ఏ హామీ ఇవ్వలేదని తెలిపారు. కాగా, 2019లో బీఆర్ఎస్ తరఫున సర్పంచ్‌గా గెలిచిన లావణ్య.. బిల్లులు వస్తాయనే నమ్మకంతో అప్పులు చేసి మరీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. బిల్లులు రాక ఆస్తులను అమ్ముకొని ఆమె పడుతున్న కష్టాలను ఇటీవల వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే..

# తెలంగాణలో 452 పక్షి జాతులు



**ఉస్మానియా ప్రొఫెసర్ పరిశోధనలో వెల్లడి**
**అంతరించిపోతున్న వాటి.. జాబితాలో**
**రాబందు, లీస్సెర్ ఫ్లోరికాన్**

హైదరాబాద్ సిటీ,జూలై 28(టుడే విదుర): తెలంగాణ వ్యాప్తంగా 452 జాతుల పక్షులు నివసిస్తున్నాయని, వాటిలో కొన్ని అరుదైన జాతులు అంతరించిపోయే దశకు చేరుకున్నాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చెలమల శ్రీనివాసులు తెలిపారు. హైదరాబాద్ బర్డ్ పల్స్ నిర్వాహకులు శ్రీరామ్ రెడ్డితో కలిసి గత 10 ఏళ్లుగా తెలంగాణ వ్యాప్తంగా చేసిన పరిశోధనల్లో ఇప్పటి వరకు 452 పక్షి జాతులను గుర్తించామని శ్రీనివాసులు తన పరిశోధన పత్రంలో పేర్కొన్నారు. వీటిలో కొన్ని అరుదైనవే కాకుండా దేశంలో తొలిసారిగా గుర్తించినవి కూడా ఉన్నాయని తెలిపారు. పక్షులు పర్యావరణంలో కీలక పాత్ర పోషిస్తాయని, కొన్ని కారణాల వల్ల భారతీయ రాబందు, లీస్సెర్ ఫ్లోరికాన్ వంటి కొన్ని జాతుల పక్షులు అంతరించి పోయే స్థితికి చేరుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి అంతరించిపోవడం పర్యావరణానికి చేటన్నారు.తెలంగాణలో మైదానాల నుంచి అడవుల వరకు, చెరువుల నుంచి గడ్డి మైదానాల వరకు వివిధ జాతులకు చెందిన పక్షులు ఆవాసం ఏర్పరుచుకున్నాయని, ఇవి కాకుండా కాలాలను బట్టి ఇతర ఖండాల నుంచి కూడా కొన్ని పక్షులు వలస వస్తాయన్నారు. హైదరాబాద్ బర్డ్ పల్స్ నిర్వాహకులు శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ.. పక్షులను గమనించడం ఇష్టంగా కాకుండా పర్యావరణ ప్రాముఖ్యతతో చూడాలన్నారు. ఏళ్ల తరబడి పరిశోధన, చారిత్రక ఆధారాల పరిశీలన, స్థానికుల సహకారంతో సేకరించిన సమాచారంతో పరిశోధన పత్రాన్ని సమర్పించామన్నారు. పక్షులపై పరిశోధన పత్రాన్ని సమర్పించిన ప్రొఫెసర్ చెలమల శ్రీనివాసులు, హైదరాబాద్ బర్డ్ పల్స్ నిర్వాహకులు శ్రీరామ్ రెడ్డిల కృషిని ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కుమార్ అభినందించారు.

# తెలంగాణ వీరుల పేరిట అవార్డులు అభినందనీయం



రవీంద్రభారతి,జూలై 28(టుడే విదుర):తెలంగాణ వీరులను స్మరించుకుంటూ వారి పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ కళోత్సవం జరిపారు. ఇందులో భాగంగా తెలంగాణ సన్మాన్ పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు ప్రొఫెసర్ జయశంకర్ పురస్కారం, బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చాకలి ఐలమ్మ, దరువు అంజన్నకు గద్దర్, కాసుల ప్రతాపరెడ్డికి సురవరం ప్రతాపరెడ్డి, పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ బీర్ల ఐలయ్య పురస్కార గ్రహీతల్ని సత్కరించి అభినందించారు. తెలంగాణ వైతాళికులు చేసిన త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరముందన్న ఆయన.. పురస్కారాలు అందుకున్న వారంతా తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారని చెప్పారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్, నారగోని పురుషోత్తం గౌడ్, కాలేరు సురేశ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# బురదమయమైన పావులపాలెం రోడ్డు.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివాసీల ఆగ్రహం



కాసిపేట జూలై 28(టుడే విదుర):‘ కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ’ అయ్యింది ఆదివాసీ గిరిజనుల పరిస్థితి. ఇప్పటికే కనీస వసతులు లేక అల్లాడుతున్న ప్రజలకు వర్షాకాలంలో రోడ్డు సమస్య మరింత జఠిలంగా మారింది. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దాపూర్ పావులగూడెంకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి మొత్తం బురదమయంగా మారింది. దీంతో గిరిజనులు రాకపోకలు సాగించటానికి నానా ఇబ్బందులు పడుతున్నారు.%ఇటీవల రోడ్డుపై వేసిన మొరంతో బురదగా మారి కనీసం నడవలేని పరిస్థితికి చేరుకున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీ కోలాం పీవీటీజీ గ్రామాలను అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. గతంలో కనీసం నడవడానికైనా రోడ్డు ఉండేదని, ఆ రోడ్డుపై మొరం బదులు బురద మట్టి వేసి రోడ్డును నాశనం చేశారని పేర్కొంటూ రోడ్డుపై కొద్దిసేపు నిరసన తెలిపారు.

# అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



సిరిసిల్ల టౌన్,జూలై 28(టుడే విదుర):బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేసూ జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఆంధ్రప్రదేశ్ అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఫ్లెక్సీ దహ నం చేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. ఆంధ్ర నాయకుల దృష్టి ఎప్పుడు తెలంగాణపైనే ఉంటుందని తెలంగాణకు నష్టం చేయాలనే ఆలోచనలతో ఉన్నారని ఆరోపిం చారు. మళ్లీ తెలంగాణలో పాగ వేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకొని కేటీఆర్‌కు క్షమా పణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మట్టె శ్రీనివాస్, ముద్దం అనిల్‌గౌడ్, కోడం వెంకటేశం, ఎస్‌కే అఫ్రోజ్, హరీష్, రాము, పవన్ పాల్గొన్నారు.



# టుడే వినోదం

## సరికొత్తగా.. వీరమల్లు వచ్చేశాడు! ఆ సీన్లు కట్.. కొత్తవి ఇన్




ఇటీవల థియేటర్‌కు వచ్చిన పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు చిత్రం అడియన్స్ నుంచి మిశ్రమ స్పందనను రాబట్టింది. రిలీజైన అన్ని చోట్ల నుంచి మంచి కలెక్షన్లను రాబడుతున్న ఈ సినిమాకు సెకండాఫ్ కాస్త ఇబ్బందికరంగా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మేకర్స్ వాటిపై దృష్టి పెట్టి వాటిని సరి చేసే పనికి పూనుకున్నారు. దీంతో ఇప్పుడు మూవీ సెకండాఫ్ విషయంలో అడియన్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు. నెగిటీవిటీ వ్యాపింప జేస్తున్న వారు సైతం సైలెంట్ అయ్యారు. పైగా సినిమా బావుందంటూ కితాబిస్తున్నారు. దీంతో ఇప్పుడు మరోమారు బ్లాక్‌బస్టర్ హరిహార వీరమల్లు అంటూ నేషనల్ వైడ్ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. అయితే.. మేకర్స్ కాస్త ఆలస్యంగానైనా మేల్కొని జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడెక్కడ అయితే సినిమాలోని సన్నివేశాలపై విమర్శలు వచ్చాయో వాటిని ట్రిమ్ చేయడం, లేదా అప్‌డేట్ చేసి మొత్తం మూవీని సరి కొత్తగా మార్చి కొత్త ప్రింట్‌ను ప్రదర్శిస్తున్నారు. అంతేకాదు కొత్తగా కొన్ని కథకు అవరమనిపించిన, మిస్సయిన సీన్లను కూడా జత చేశారు. దీంతో సినిమాపై ఇప్పటి వరకు వచ్చిన విమర్శలకు చిత్ర బృందం చెక్ పెట్టింది. ఇప్పుడు సినిమా చూసిన వారంతా ఆ చేసే పనేదో ముందే చేసి ఉంటే ఇంత రచ్చ జరిగేది కాదు, సింపుల్‌గా రూ.500 కోట్లు కొట్టేవారు కదా అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## కీరవాణి సలహాతోనే అలా.. స్పెషల్ సాంగ్‌పై క్లారిటీ




చిరంజీవి హీరోగా వశిష్ఠ మల్లిడి తెరకెక్కిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. త్రిష కథానాయికగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని యు.వి క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీత దర్శకుడు. అయితే ఇందులో ఓ స్పెషల్ సాంగ్‌కు మాత్రం భీమ్స్ స్వరాలు అందించారు. దీనిపై చర్చ నడుస్తోంది. కీరవాణి ఇచ్చిన ట్యూన్ నచ్చకపోవడంతోనే భీమ్స్‌తో చేయించారిన టాక్ నడిచింది. అది పూర్తిగా అవాస్తవమని దర్శకుడు వశిష్ట క్లారిటీ ఇచ్చారు. 'పలు యూట్యూబ్ ఛానళ్లు ఆస్కార్' వచ్చిన కీరవాణిని అవమానించారు' అంటూ థంబ్‌నైల్స్ పెట్టి, ఎలాపడితే అలా రాతలు రాశాయి. 'విశ్వంభర'లోని ప్రత్యేక గీతం చేయాల్సిన సమయానికి కీరవాణి.. 'హరిహర వీరమల్లు' ఆర్‌ఆర్‌తో బిజీగా ఉన్నారు. అందుకే ఆయనే 'ఈ సాంగ్‌ని మరో మ్యూజిక్ డైరెక్టర్‌తో చేయిద్దాం' అని సజెస్ట్ చేశారు. అదేంటి సర్ అని నేనంటే.. 'ఇందులో తప్పేముంది? ఒక పాట ఒకరు ర్మాస్త.. మరో పాట వేరొకరు రాస్తారు. ఇదీ అంతే అని సింపుల్‌గా అన్నారు. నా తొలి సినిమా 'బింబిసార'కి చిరంతన్ భట్‌తో కలిసి ఆయన వర్క్ చేశారు. ఈ విషయాన్నీ గుర్తు చేశారు. వర్క్ ఆగకూడదన్నది ఆయన ఉద్దేశం. ఈ విషయాన్ని చిరంజీవికీ ఆయనే చెప్పారు. అలా భీమ్స్‌ని ఎంపిక చేశాం. ఈ స్పెషల్ సాంగ్ చిరంజీవిగారు నటించిన చిత్రాలు 'రిక్షావోడు', 'ముఠామేస్త్రి' చిత్రాల థీమ్ మ్యూజిక్ వినిపిస్తుందని కొందరు అంటున్నారు. అన్నయ్యలో 'ఆట కావాలా పాట కావాలా', ఖైదీ 'రగులుతుంది మొగలిపొద వంటి సాంగ్ అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. అలాంటిదేమీ లేదు. ఇదొక ఫ్రెష్ సాంగ్' అని అన్నారు.

## ఆ ఓటీటీకి.. వచ్చేస్తున్న వీరమల్లు! ఎప్పటినుంచంటే




చాలా గ్యాప్ తర్వాత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీర మల్లు చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్సడ్ టాక్‌తో ఫర్వాలేదని అనిపించుకుంటోంది. మూడేండ్ల తర్వాత పవన్ నటించిన చిత్రం అవడం, హిస్టారికల్ డ్యాక్‌డ్రాప్ కావడం ఈ సినిమాకు మంచి హైప్ తీసుకు వచ్చాయి. అదీ గాక ఎన్నడు లేనిది పవన్ కల్యాణ్ స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఓ రేంజ్‌లో ప్రమోషన్స్ చేయడం ఈ సినిమాకు బాగా కలిసి వచ్చి అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. అయితే.. ఇప్పుడు ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధం అవుతోంది. %16వ శతాబ్దం చివరలో నడిచే కథగా రూపొందిన ఈ చిత్రంలో కృష్ణా తీరంలో లభించిన కోహినూర్ వజ్రం అనే రాజుల చేతులు మారి మొగలుల చెంతకు చేరుతుంది. అదే సమయంలో దొంగతనాలు చేస్తూ నాటి బ్రిటీష్ వాళ్లకు, పాలెగాళ్లకు సింహా స్వప్నంలా మారతాడు వీరమల్లు. ఓ చోరీ విషయంలో నాటి కుతుబ్ షాహీ సైనికులకు చిక్కుతాడు. అయితే.. దక్కన్ ఆత్మ గౌరవానికి చిహ్నమైన కోహీనూర్ వజ్రాన్ని మొగలుల వద్ద నుంచి తీసుకు వస్తే అడిగింది ఇస్తా, చేస్తా అని ఆ రాజు మాట ఇవ్వడంతో ఢిల్లీ ప్రయాణం స్టార్ట్ చేస్తాడు.

## డైలాగ్ కింగ్ బర్త్ డే.. ఫస్ట్ లుక్ పోస్టర్ల సునామీ




నటుడు సాయికుమార్ పేరు తలచుకోగానే ముందు గుర్తుకు వచ్చేది ఆయన గంభీరమైన ఆకట్టుకునే వాచకం. ఆయన గళం నుండి జాలువారిన ప్రతి పదం ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసింది. అందుకే ఆయనకు అభిమానులు 'డైలాగ్ కింగ్' బిరుదు ఇచ్చి కొనియాడారు. 1960 జూలై 27న జన్మించిన సాయికుమార్ కుటుంబం సినీ రంగంతో అనుబంధం కలిగి ఉంది. ఆయన తండ్రి పి.జె.శర్మ తెలుగు సినీ రంగంలో నటుడిగా గుర్తింపు పొందారు. తనకందిన పాత్రల్లో నటిస్తూ, అనేక మంది పరభాషా నటులకు డబ్బింగ్ చెప్పి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించారు. అదే మార్గంలో సాయికుమార్ కూడా సాగడం విశేషం. %తన కెరీర్ ప్రారంభంలోనే సాయికుమార్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పలు సినిమాల్లో హీరోలకు, ఇతర పాత్రలకు సైతం తన స్వరాన్ని అందించారు. ఆ తర్వాత హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎన్నో హిట్ సినిమాలలో నటించి తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన శక్తివంతమైన డైలాగ్ డెలివరీ, భావప్రధానమైన నటన ఇప్పటికీ టాలీవుడ్‌లో అపూర్వం. అయితే.. ఆదివారం (జూలై 27)న సాయి కుమార్ జన్మదినం సందర్భంగా ఆయన నటించిన, నటిస్తోన్న సినిమాల నుంచి పోస్టర్లను మేకర్స్ ఆదివారం రిలీజ్ చేశారు.

## రష్మిక.. నెవర్ బిఫోర్ హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ స్టార్ట్




భారీ బడ్జెట్ చిత్రాలతో బాలీవుడ్, టాలీవుడ్‌లలో వరుస సక్సెస్‌లు సాధిస్తున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో కొత్త తెలుగు చిత్రం 'మైసా'ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను నిర్మిస్తోంది. 'సీతారామం', 'ఫౌజీ' చిత్రాలకు అసోసియేట్‌గా పనిచేసిన హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇది ఔట్ అండ్ అవుట్ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్గా తెరకెక్కనుంది. %తెలంగాణలోని అదిలాబాద్ జిల్లాలో అధికంగా నివసించే ప్రముఖ ఆదివాసి జాతి గోండు తెగ నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుంది. భయమెరగని ఓ వీరనారి పాత్రలో రష్మిక కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ ఫోటోలు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ క్రియేట్ చేశాయి. రష్మిక లుక్ పోస్టర్‌లో స్టన్నింగ్‌గా ఉండటం విశేషం.

## మయసభలో ఎన్టీఆర్‌గా డైలాగ్ కింగ్




ఇక్కడ మీరు ఏ పాత్ర పోషించారో కానీ, 'తుక్కు రేగ్గొట్టారు' తెలుగు ప్రేక్షకులు ఆగస్ట్ 7న మరోసారి మీ నట విశ్వరూపాన్ని చూడబోతున్నారు'.. అంటూ సాయికుమార్‌ను ఉద్దేశించి దర్శకుడు దేవా కట్టా చేసిన ఈ ట్వీట్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతుంది. ప్రస్తుతం సోనీలివ్ ఓటీటీ కోసం దేవా కట్టా 'మయసభ' సిరీస్ తెరకెక్కిస్తున్నారు. ఆగస్టు 7వ తేదీ నుంచి ఇది స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. ఇందులో సాయికుమార్ ఓ కీలక పాత్ర పోషించనున్నారని చెబుతూ ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'ప్రస్థానం' 'ఆటోనగర్ సూర్య' తర్వాత 'మయసభ'తో మూడవసారి పని చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నిండు నూరేళ్లు ఆనందంగా ఆరోగ్యంగా మీకు నచ్చిన పాత్రలు చేస్తూ లైఫ్ ఎంజాయ్ చేయాలని మీ అభిమానిగా ఆశిస్తున్నాను' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.కారులో కూర్చుని అభివాదం చేస్తున్న సాయికుమార్ పోస్టర్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. సాయికుమార్ పోషించిన పాత్ర ఏంటా అని ఆరా తీస్తున్నారు. అయితే ఇద్దర్ము స్నేహితులు.. రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారనే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న ఈ సిరీస్‌లో సాయికుమార్ ఎన్టీఆర్ పాత్ర పోషిస్తున్నారని తెలిసింది. ఇందులో ఆది పినిశెట్టి, చైతన్య రావు కీలక పాత్రలు పోషించనున్నారు. ఏపీ చరిత్రను మలుపు తిప్పిన రాజకీయ పరిణామాల చుట్టూ దేవా కట్టా ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

## టుడే స్పోర్ట్స్

# టీమిండియాలో భారీ మార్పులకు బీసీసీఐ సిద్ధమవుతోందా..



ఇంటర్నెట్ డెస్క్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ తరువాత టీమిండియాలో భారీ మార్పులకు బీసీసీఐ సిద్ధమవుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రస్తుతం సేఫ్‌గానే ఉన్నప్పటికీ బౌలింగ్ విషయంపై బీసీసీఐ దృష్టి సారించే అవకాశం ఉంది. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, అసిస్టెంట్ కోచ్ దస్కాటే విషయంలో ఉత్కంఠ మొదలైంది. ఈ ఇద్దరినీ గంభీర్ సిఫారసు చేసిన విషయం తెలిసిందే. వీరిరువురూ ఈ టోర్నీలో ఆశించిన మేర ఫలితాలు రాబట్టలేకపోయారు. అయితే, టీమ్ సంధి దశలో ఉన్న సమయంలో హెడ్ కోచ్ విషయంలో ఎలాంటి మార్పులు చేయొద్దన్న అభిప్రాయంతో బీసీసీఐ ఉన్నట్టు జాతీయ మీడియా కథనాల్లో తేలింది. ఇటీవల డ్రాగా ముగిసిన నాలుగో టెస్టు మ్యాచ్‌లో కుల్దీప్ యాదవ్‌కు ఛాన్స్ ఇవ్వకపోవడం, అన్షుల్ కాంబోజ్ రంగంలోకి దించడం విమర్శలకు తావిచ్చాయి. ఈ నిర్ణయాలపై పరిశీలకులు, ఫ్యాన్స్ కూడా పెదవి విరిచారు. ఇక చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, ఈస్ట్ జోన్ ప్రతినిధి శివ్ సుందర్ దాస్‌పై కూడా బీసీసీఐ దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. కుల్దీప్ విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్‌కు ప్లేయర్లకు మధ్య అభిప్రాయభేదాలు ఉన్నట్టు సమాచారం. అయితే, భారత్‌కు అండగా నిలిచే ఒక్క పేసర్‌ను కూడా తీర్చిదిద్దలేకపోయినందుకు మోర్కెల్‌పై బీసీసీఐ అసంతృప్తితో ఉందట. ఇంగ్లండ్‌తో టెస్టు అనంతరం బీసీసీఐ సమీక్షకు దిగినా ఆసియా కప్ తరువాతే భారీ మార్పులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టును డ్రాగా ముగించిన టీమిండియా సిరీస్ పై ఆశలు సజీవంగానే ఉంచుకుంది. దీంతో, తదుపరి జరగనున్న ఐదో టెస్టుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ మ్యాచ్‌కు టీమిండియా లైనప్‌లో కొన్ని మార్పులు కనిపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. గాయం బారిన పడ్డ రిషభ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురేల్, జస్ప్రిత్ బుమ్రా స్థానంలో ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్ స్థానంలో ప్రసిద్ధ కృష్ణ, కుల్దీప్ యాదవ్‌కు ఈ మ్యాచ్‌లో స్థానం దక్కే అవకాశాలు మెండుగా ఉంది.

# భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ..

## శిఖర్ ధావన్ సూటి సమాధానం




ఇంగ్లండ్‌లో జరుగుతున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (%ఔజూ%) 2025 రెండో ఎడిషన్‌లో ఇండియా ఛాంపియన్స్ జట్టు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేదు. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగిన భారత జట్టు, టోర్నమెంట్ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో ఉంది. అయితే, ఈ లీగ్‌లో పాకిస్తాన్ ఛాంపియన్స్‌తో మ్యాచ్ ఆడేందుకు ఇండియా ఛాంపియన్స్ నిరాకరించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిర్ణయంపై పాకిస్తాన్ ఆటగాళ్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే %ఔజూ% 2025 మ్యాచ్ రద్దు తర్వాత, పాకిస్తాన్ ఆటగాళ్లు ధావన్.. నిర్ణయాన్ని ప్రభావితం చేశారని ఆరోపించారు

# స్టోక్స్‌కు నో



ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో 138వ ఓవర్ ముగిశాక కెప్టెన్ స్టోక్స్ డ్రా కోసం ముందుకు వచ్చాడు. అయితే జడేజా, సుందర్ సెంచరీకి చేరువలో ఉండడంతో దీనికి అంగీకరించలేదు. దీంతో స్టోక్స్ అసంతృప్తి వ్యక్తం చేయడం కనిపించింది. అటు డ్రెస్సింగ్ రూమ్ నుంచి కెప్టెన్ గిల్ చిరునవ్వుతో ఇదంతా గమనిస్తున్నా అతడి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక మ్యాచ్‌ను త్వరగా పూర్తి చేసేందుకు స్టోక్స్ తమ ఫీల్డర్లను సర్కిల్ లోపలే ఉంచాడు. దీంతో ఆ తర్వాత ఐదు ఓవర్లలోనే వేగంగా బౌండరీలు రాబట్టి జడ్డూ, సుందర్ తమ శతకాలను పూర్తి చేసి ఆటను ముగించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 203 పరుగులు జోడించడం విశేషం.

# 2025: టీమిండియా అద్భుత పోరాటం





బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్. దీనికి తోడు సున్నాకే రెండు వికెట్లు ఫట్. ఈనేపథ్యంలో టీమిండియా గెలుపు కాదు కదా.. కనీసం డ్రా కూడా అసాధ్యమేనేమో అనిపించింది. కానీ పోరాడితే పోయేదేముందనే కసితో బరిలోకి దిగిన టీమిండియా అబ్బురపరిచింది. కెప్టెన్ గిల్ తన అసాధారణ ఆటతీరుతో సిరీసలో నాలుగో శతకం సాధించగా, రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్ సెంచరీ సమీపంలో నిలిచింది. ఇక జడేజా-సుందర్‌లు రెండు సెషన్ల పాటు నిలిచి అజేయ సెంచరీలతో ఓటమి నుంచి కాపాడారు. వీరి పోరాటంతో మ్యాచ్ గ్రేట్ ఎస్కేప్ రీతిలో చరిత్రాత్మక డ్రాగా ముగిసింది. దీంతో తమదే విజయమనే ధీమాలో ఉన్న ఇంగ్లండ్‌కు దిమ్మ తిరిగింది. ఈ అలుపెరగని పోరాటంతో యువ కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని నయా భారత్‌ను తక్కువ అంచనా వేయరాదని ప్రత్యర్థి జట్లకు చాటి చెప్పింది. మాంచెస్టర్: ఐదు టెస్టుల సిరీసలో భారత జట్టు తమ ఆశలను సజీవంగా ఉంచుకుంది. బ్యాటర్ల అసామాన్య పోరాటంతో ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్టును టీమిండియా డ్రాగా ముగించింది. దీంతో ఈనెల 31 నుంచి జరిగే ఐదో టెస్టులో నెగ్గి సిరీసను సమం చేయాలనుకుంటోంది. ప్రస్తుతం స్టోక్స్ సేన 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరి రోజు ఆదివారం ఆటలో జడేజా (107 నాటౌట్), సుందర్ (101 నాటౌట్), కెప్టెన్ గిల్ (103) శతకాలతో హోరెత్తించారు. దాదాపు రోజంతా బ్యాటింగ్ సాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 143 ఓవర్లలో 425/4 స్కోరుతో నిలిచింది. రాహుల్ (90) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వోక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా స్టోక్స్ నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులు చేశాయి. %గిల్ శతక పోరాటం: 174/2 ఓవర్‌నైట్ స్కోరుతో చివరి రోజు భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. శనివారం క్రీజులో పాతుకుపోయి డ్రాపై ఆశలు రేపిన కెప్టెన్ గిల్, రాహుల్ ఏమేరకు పోరాడతారనే ఆసక్తి అంతటా వ్యక్తమైంది. అయితే తన క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న రాహుల్ సెంచరీకి మరో 10 రన్స్ దూరంలోనే ఆగాడు. ఆట ఆరంభమైన కాసేపటికే అతడిని స్టోక్స్ ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మూడో వికెట్‌కు 421 బంతుల్లో 188 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెర పడింది. ఇక స్టోక్స్ తర్వాతి ఓవర్‌లో బంతి గిల్ కుడిచేతి బొటన వేలికి తాకి పైకి లేచి హెల్మెట్‌ను సైతం తాకడంతో బాధతో విలవిల్లాడాడు. ఫిజియో వచ్చి పరిశీలించాక బ్యాటింగ్ సాగించాడు. నాలుగో రోజు బౌలింగ్‌కు దూరంగా ఉన్న స్టోక్స్ ఆదివారం మాత్రం భుజం నొప్పితోనే వరుసగా ఎనిమిది ఓవర్ల స్పెల్ వేసి బౌన్స్‌తో ఇబ్బందిపెట్టాడు. 90 పరుగులకు చేరాక నిదానం కనబర్చిన గిల్ మరో 10 రన్స్ కోసం 36 బంతులాడి శతకం పూర్తి చేసుకున్నాడు.

# ఫలితం టైబ్రేక్‌కు



బటూమి (జార్జియా): మహిళల చెస్ వరల్డ్‌కప్ విజేత ఎవరో తేలేది టైబ్రేక్‌లోనే. జీఎం కోనేరు హంపి, ఐఎం దివ్య దేశ్‌ముఖ్ మధ్య ఆదివారం జరిగిన రెండో క్లాసిక్ గేమ్ కూడా 34 ఎత్తుల్లో డ్రాగా ముగిసింది. తొలి గేమ్‌లో కూడా ఇద్దరూ పాయింట్ పంచుకొన్నారు. హంపి, దివ్య 1-1తో సమంగా నిలవడంతో.. క్వీన్ ఎవరనేది సోమవారం జరిగే టైబ్రేక్‌లో తేలనుంది. రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడడం హంపికి లాభిస్తుందని భావించారు. కానీ, డేరింగ్‌గా ఆడే దేశ్‌ముఖ్ వీలైనంతగా డ్రా కోసం ప్రయత్నించింది. ఇద్దరూ సరికొత్త ప్రయోగాలు చేయకుండా.. సంప్రదాయ ఆటకే ప్రాధాన్యమిచ్చారు. కోనేరు ఇంగ్లిష్ ఓపెనింగ్ చేయగా.. దేశ్‌ముఖ్ అగిన్‌కోర్ట్ డిఫెన్స్‌తో ఎదుర్కొంది. మిడిల్ గేమ్‌లో బోర్డుపై ఆధిపత్యం సాధించడానికి పాన్‌ను ట్రేడ్ చేసింది. అయితే, దివ్య బిషపతో ఎఫ్3లోని హంపి నైట్‌ను పిన్ చేసింది. ఈ క్రమంలో హంపి నైట్‌ను కోల్పోగా.. దివ్య బిషపను చేజార్చుకొంది. 14వ ఎత్తు వేయడానికి కోనేరు కొంత సమయం తీసుకోగా.. దివ్యకు 20 నిమిషాల ఆధిక్యం దక్కింది. 16 ఎత్తుల తర్వాత ఇద్దరూ రూక్‌లను ట్రేడ్ చేసుకొన్నారు. హంపి, దివ్య సమవుజ్జీలుగా నిలవడంతో.. గేమ్ డ్రా దిశగా సాగింది.

# చైనా చిన్నది ఫైనల్ చేరింది



సింగపూర్: ఈత కొలనులో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న 12 ఏళ్ల చైనా టీనేజ్ స్విమ్మర్ యు జిడి ఊహించినట్లే అంతర్జాతీయ స్విమ్మింగ్‌లోనూ సంచలనం దిశగా దూసుకెళ్తోంది. ఇటీవల చైనా చాంపియన్‌షిపలో అద్భుత ప్రదర్శన చేసి ప్రపంచ టోర్నీకి అర్హత సాధించిన ఈ చిన్నది.. ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిపలోనూ తన అరంగేట్రాన్ని ఘనంగా చాటింది. ఈ మెగా టోర్నీలో 200 మీటర్లు, 400 మీటర్లు వ్యక్తిగత మెడ్లే, 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగాల్లో పోటీపడుతోన్న యు జిడి.. ఆదివారం ఇక్కడ జరిగిన 200 మీటర్ల మెడ్లేలో ఫైనల్ చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొదట 2 నిమిషాల 11.90 సెకన్ల టైమింగ్‌తో సెమీఫైనల్ చేరింది. మొత్తం 16 మంది క్వాలిఫయర్స్‌లో జిడి 15వ ఫాస్టెస్ట్ టైమ్ నమోదు చేసింది. అనంతరం సెమీసలో 2 నిమిషాల 10.22 సెకన్ల టైమింగ్‌తో ఏడోస్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

# అంకితకు రజతం



న్యూఢిల్లీ: జర్మనీలోని ఎస్సెన్ నగరంలో ఆదివారం ముగిసిన ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలను భారత్ మొత్తం 12 పతకాల (2-5-5)తో ముగించింది. చివరి రోజు..మహిళల మూడువేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అంకిత ధ్యానీ రజతం సాధించింది. ఇక, పురుషుల 4గీ100 మీ. రిలేలో, మహిళల 20 కి.మీ. రేస్‌వాక్ టీమ్ ఈవెంట్‌లో మనోళ్లు కాంస్యాలు నెగ్గారు. ఆఖరి రోజు పలువురు భారత అథ్లెట్లు ట్రాక్ విభాగాలలో తలపడినా..కేవలం రెండు పతకాలే లభించాయి. 23 ఏళ్ల అంకిత తొమ్మిది నిమిషాల 31.99 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో రేస్‌ను పూర్తి చేసి రజతం దక్కించుకుంది. ఫిన్లాండ్, జర్మనీ అథ్లెట్లు స్వర్ణ, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. లాలూ ప్రసాద్, అనిమేష్ కుజుర్, మణికంఠ, మృత్యుంజయరాంతో కూడిన జట్టు 4గీ100 మీ. రిలేను 38.89 సెకన్లతో పూర్తి చేసి కాంస్యం చేజిక్కించుకుంది. దక్షిణకొరియా స్వర్ణం, దక్షిణాఫ్రికా కాంస్య పతకం నెగ్గాయి.

# విండీస్ అదే తీరు



సెయింట్ కిట్స్: వెస్టిండీస్ జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. ఆస్ట్రేలియాతో శనివారం జరిగిన నాలుగో టీ20లోనూ 3 వికెట్ల తేడాతో ఓడింది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీసలో 0-4తో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన విండీసకిది ఈ ఫార్మాట్‌లో వరుసగా ఏడో ఓటమి. గత నెలలో ఇంగ్లండ్‌పై 0-3తో వైట్‌వాష్ అయ్యింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 205/9తో భారీ స్కోరు సాధించింది. రూథర్‌ఫోర్డ్ (31) టాప్‌స్కోరర్. జంపాకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 19.2 ఓవర్లలో 206/7 స్కోరుతో నెగ్గింది. గ్రీన్ (55), ఇన్‌గ్లిస (51), మ్యాక్స్‌వెల్ (47) రాణించారు. బ్లేడ్స్‌కు మూడు వికెట్లు దక్కాయి.

# టుడే బిజినెస్

## మళ్లీ తగ్గిన బంగారం, వెండి ధరలు.. ఎంతకు చేరుకున్నాయంటే




బంగారం, వెండి ప్రియులకు కాస్త ఊరట లభించింది. ఎందుకంటే నిన్నటితో పోల్చితే వీటి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో జులై 28, 2025న ఉదయం 6:20 గంటల సమయానికి, గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గిపోయాయి.

24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.10 తగ్గి రూ.99,920కి చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,159 స్థాయికి చేరింది. అదే సమయంలో, వెండి ధర కిలోకు రూ.100 తగ్గి రూ.1,15,900కి చేరుకుంది. ఈ తగ్గుదల బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట కలిగిస్తుందని చెప్పవచ్చు.

ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,920గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,159గా ఉంది. వెండి ధర కిలోకు రూ.1,25,900కు చేరుకుంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,00,070, 22 క్యారెట్ల బంగారం రూ.91,740గా ఉంది, వెండి ధర కిలోకు రూ.1,15,900గా ఉంది.

ఈ నగరాల్లో కూడా..

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రేటు రూ.99,920, 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,590, వెండి ధర రూ.1,25,900గా నమోదైంది. ముంబైలో కూడా ఇదే స్థాయిలో ధరలు ఉన్నాయి. అయితే వెండి ధర కిలోకు రూ.1,15,900గా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం రూ.99,920, 22 క్యారెట్ల బంగారం రూ.91,590, వెండి రూ.1,15,900గా కలదు. ఈ ధరలు ఆయా నగరాల్లోని స్థానిక జ్యూయలర్స్, మార్కెట్ డిమాండ్ ఆధారంగా మారుతుంటాయి.

బంగారం, వెండి ధరల తగ్గుదలకు కారణాలు

బంగారం, వెండి ధరల తగ్గుదలకు అనేక అంతర్జాతీయ, దేశీయ కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడం భారతదేశంలోనూ ప్రభావం చూపింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచడం లేదా కొంత పెంచడం వల్ల డాలర్ విలువ బలపడింది. దీనివల్ల బంగారం ధరలు తగ్గాయి. ఆర్థిక అస్థిరత తగ్గడం వల్ల పెట్టుబడిదారులు బంగారం కంటే ఇతర ఆస్తుల వైపు మొగ్గ చూపుతున్నారు, దీనివల్ల డిమాండ్ తగ్గింది.

## మీ డబ్బును రెట్టింపు చేసే ఈజీ ఫార్ములా.. దీని గురించి తెలుసా మీకు




మీరు మీ డబ్బును పెంచుకోవాలని, రెట్టింపు చేసుకోవాలని ఆలోచిస్తున్నారా. అందుకు మీకోసం ఒక ఈజీ ట్రిక్ అందుబాటులో ఉంది. అదే రూల్ ఆఫ్ 72 . ఈ ఫార్ములా మీ డబ్బు ఎంత సమయంలో రెట్టింపు అవుతుందో లెక్కలు లేకుండా క్షణాల్లో చెప్పేస్తుంది. అదే దీని స్పెషల్.రూల్ ఆఫ్ 72 అనేది ఆర్థిక రంగంలో మనీ రెట్టింపు కావడానికి సులభంగా తెలుసుకునే పరిష్కార మార్గం. ఇది మీ పెట్టుబడిపై వచ్చే వడ్డీ రేటు ఆధారంగా డబ్బు రెట్టింపు కావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో అంచనా వేస్తుంది. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్ వంటి పథకాల్లో ఎక్కడ పెట్టుబడి పెట్టినా కూడా ఈ ఫార్ములా మీ డబ్బు ఎలా పెరుగుతుందో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.72 ̥ మీ పెట్టుబడిపై వార్షిక వడ్డీ రేటు (%) = డబ్బు రెట్టింపు కావడానికి పట్టే సంవత్సరాలుఉదాహరణకు మీరు ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో రూ. 1 లక్ష పెట్టుబడి పెడితే అక్కడ మీకు సంవత్సరానికి 6% వడ్డీ వస్తుందని అనుకుందాం. దీని ప్రకారం లెక్కించే విధానంలో 72 ̥ 6 = 12 సంవత్సరాలు. అంటే మీ లక్ష రూపాయలు, 2 లక్షలుగా మారడానికి దాదాపు 12 సంవత్సరాలు పడుతుంది.

## కారును విక్రయిస్తున్నారా.. మంచి ధర రావాలంటే ఇలా చేయండి

ఇంటర్నెట్ డెస్క్: సొంత కారు గురించి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది పాతబడక తప్పదు. క్రమం తప్పకుండా కారును సర్వీసింగ్‌కు ఇస్తున్నా సరే ఒక్కోసారి కారుపై పడే గీతలు, సొట్టలు వంటివి మన దృష్టిని దాటిపోతాయి. ఇక కారు అమ్మాల్సిన సమయం వచ్చినప్పుడు ఇవన్నీ ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. ఆశించిన దాని కంటే తక్కువకే వెహికిల్‌ను విక్రయించాల్సి వస్తుంది. ఇలాంటి బెడద లేకుండా ఉండాలంటే ఏం చేయాలనే దానిపై నిపుణులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేస్తున్నారు. %కారు మెయిన్‌టెనెన్స్ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దు. కారు కంపెనీ సూచించిన దాని ప్రకారం, క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించుకోవాలి. చిన్న చిన్న సొట్టలు, అద్దాలు పగలడం వంటి లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దుకోవాలి. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్స్ అన్నీ జాగ్రత్త చేసుకోవాలి. కారు అమ్మే సమయంలో ఇవి చాలా అక్కరకు వస్తాయి. మంచి ధరకు కారును విక్రయించేందుకు అవకాశం ఉంటుంది.కారులో యాక్సెసరీలు బాగుంటే మంచి ధరకు వాహనాన్ని విక్రయించొచ్చు. అధునాతన ఫీచర్లు, టెక్నాలజీ



ఉన్న కార్లపై కొనుగోలుదార్లు ఆసక్తి ప్రదర్శిస్తారు. కాస్త ఎక్కువ ధర చెల్లించైనా సరే వాటిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఆధునిక ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్స్, బ్లూ టూత్ కనెక్టివిటీ, బ్యాకప్ సెన్సర్లు, కెమెరా, నావిగేషన్ సిస్టమ్స్ వంటివి ఉంటే కారును అధిక ధరకు విక్రయించవచ్చు.

## మరికొంత కాలం లాభాలపై ఒత్తిడి తప్పదు




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ లాభాలపై ఒత్తిడి తగ్గించుకునే పనిలో పడింది. ఇందుకోసం పరిమితికి మించి ఇచ్చిన ప్రాధాన్యతా రుణాల్లో మరికొంత మొత్తాన్ని ఈ త్రైమాసికంలో అమ్మకానికి పెడుతోంది. బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు ఈ విషయం వెల్లడించారు. జూన్ త్రైమాసికంలోనూ ఈ అధిక ప్రాధాన్యతా రంగ రుణాల్లో కొన్ని రుణాలను విక్రయించడం ద్వారా కెనరా బ్యాంక్ రూ.1,248 కోట్ల కమీషన్ ఆదాయం ఆర్జించింది. అయినా జూన్ త్రైమాసికం ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం రుణాల్లో ప్రాధాన్యతా రుణాల వాటా 45.63 శాతం వరకు ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్దేశించిన 40 శాతం కంటే ఇది 5.63 శాతం ఎక్కువ. ఈ అధిక ప్రాధాన్యతా రుణాలను కొనేందుకు మార్కెట్లో అనేక బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు రాజు చెప్పారు.

## టెక్ వ్యూ 25000 వద్ద పునరుజ్జీవం తప్పనిసరి



నిఫ్టీ గత వారం కీలక స్థాయి 25,000 వద్ద రికవరీతో ప్రారంభమైనా 25,250 వద్ద విఫలమై చివరి రెండు రోజుల్లో బలమైన రియాక్షన్‌లోకి జారుకుంది. చివరికి వారం మొత్తానికి 130 పాయింట్ల నష్టంతో 24,830 వద్ద ముగిసింది. గత కొద్ది రోజులుగా 25,000 స్థాయిలో ఏర్పడిన కన్సాలిడేషన్‌లో విఫలమైంది. అలాగే మిడ్‌క్యాప్–100, స్మాల్‌క్యాప్–100 సూచీలు కూడా బలమైన కరెక్షన్ సాధించాయి. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. నిఫ్టీ గత నాలుగు వారాలుగా నిరంతర కరెక్షన్ ట్రెండ్‌లో ట్రేడవుతూ 850 పాయింట్ల మేరకు నష్టపోయింది. ప్రస్తుతం 25,000 కన్నా దిగువకు వచ్చినందువల్ల స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగవచ్చు. %బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి ఇంతకాలం మద్దతు స్థాయిగా ఉన్న 25,000 ఇప్పుడు నిరోధ స్థాయిగా మారింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ స్థాయిలో పునరుజ్జీవం సాధించి తీరాలి.బేరిష్ స్థాయిలు: మరింత బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 24,700 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,450.బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ సైతం గత కొద్ది వారాలుగా 57,000 వద్ద సాగిన కన్సాలిడేషన్ అనంతరం విఫలమై వారం కనిష్ఠ స్థాయి 56,520 వద్ద ముగిసింది.

## బౌన్స్ బ్యాక్ అయితేనే



దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. మార్కెట్లలో మళ్లీ బుల్ రన్ కొనసాగాలంటే ఇప్పటి స్థాయిలను అధిగమించాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా రాజకీయ పరిణామాలు మారుతుండటం, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవటం, వడ్డీ రేట్ల కోతలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవటం నెగటివ్ సెంటిమెంట్‌కు దారితీస్తోంది. నిఫ్టీ 50 డీఎంఏ, 25,000 దిగువకు రావటం కలవరపెడుతోంది.డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: తాజా గరిష్ఠం రూ.1,379 నుంచి స్వల్ప దిద్దుబాటుకు లోనైన ఈ కౌంటర్ ప్రస్తుతం మెరుగ్గా చలిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ పెరుగుతోంది. పైగా ఫార్మా రంగ సూచీ బ్రేకౌట్ ఇచ్చింది. గత శుక్రవారం రూ.1,277 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,270/1,250 శ్రేణిలో ప్రవేశించి రూ,1350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,225 స్థాయిని స్టాప్‌లా‌సగా పెట్టుకోవాలి.ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్: ఈ షేరు నష్టాల మార్కెట్లోనూ మెరుగ్గా రాణించింది. గత శుక్రవారం రూ.1,921 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ,1,900 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. బై ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేయాలి.

## మైనర్లకూ పాన్ కార్డు ఇస్తారని తెలుసా.. ఎలా అప్లై చేసుకోవాలంటే..

ఇంటర్నెట్ డెస్క్: పాన్ కార్డు అంటే కేవలం పెద్దలకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఇది పిల్లలకూ కీలకమే. ఆర్థిక వ్యవహారాల్లో అడ్డంకులు లేకుండా ఉండేందుకు పాన్ కార్డు అవసరం. పిల్లల భవిష్యత్తు కోసం మంచి ప్రణాళికకు పాన్ కార్డు అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం ప్రకారం, మైనర్లూ పాన్ కార్డు పొందొచ్చు.%సాధారణంగా పిల్లల ఆదాయాన్ని ఇన్‌కమ్ ట్యాక్స్ పరంగా చాలా సందర్భాల్లో పెద్దల ఆదాయంలో కలిపి చూపించినప్పటికీ కొన్ని సార్లు పిల్లల పాన్ కార్డులు కూడా అక్కరకు వస్తాయి. మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్, ఇతర పెట్టుబడి సాధనాల్లో పిల్లలను నామినీగా చేర్చాలనుకుంటే పాన్ కార్డు అవసరం. నటన, స్పోర్ట్స్, ఇతర వ్యాపకాల ద్వారా పిల్లలకు ఆదాయం వస్తుంటే ట్యాక్స్ మేనేజ్‌మెంట్ కోసం పాన్ కార్డు తప్పనిసరి. కొన్ని రకాల స్కాలర్‌షిప్ అభ్యర్థులకు పాన్ కార్డు తప్పనిసరి.ఇక 18 ఏళ్ల లోపు ఉన్న వారి కోసం పాన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే కొన్ని డాక్యుమెంట్స్ రెడీ చేసుకోవాలి. పిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకుల అడ్రస్ ప్రూఫ్, గుర్తింపు కార్డు, చిన్నారి అడ్రస్ ప్రూఫ్, గుర్తింపు కార్డు ఉండాలి. అప్లికేషన్‌లో రాసిన వివరాలకు ఈ డాక్యుమెంట్స్‌లోని వివరాలకు మధ్య ఎలాంటి తేడా ఉండకూడదు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006